# ఆంధ్రజ్యోతి



## సోమశిలలో 28.512 టీఎంసీల నీటి నిల్వ



**అనంతసాగరం, జనవరి 21:** సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, ఆదివారం నాటికి జలాశయంలో 28.512 టీఎంసీలలు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,450, ఉత్తర కాలువకు 500, దక్షిణ కాలువకు 200 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లుగా వారు వెల్లడించారు.

# అంతా రామమయం..!

- పలు ఆలయాల్లో రామనామ స్మరణ
- బాలరాముడిని కనులారా వీక్షిద్దాం రండి !
- అయోధ్య రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ ప్రత్యక్ష ప్రసారానికి భారీగా ఎల్ఈడీ స్క్రీన్ల ఏర్పాటు
- నేడు అభిషేకాలు, ప్రత్యేక పూజలు, రామభజనలు
- ప్రధాన కూడళ్లలో తోరణాలు, కాషాయ జెండాలు

**నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 21:** అయోధ్య రామమందిరంలో సోమవారం మధ్యాహ్నం జరగనున్న బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను తిలకించేందుకు జిల్లాలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. అయోధ్య రాముడ్ని చూసేందుకు చిన్నాపెద్ద ఎంతో ఆతృతగా ఎదు రు చూస్తున్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, విశ్వహిందూ పరిషత్, భారతీయ జనతా పార్టీల పిలుపు మేరకు జిల్లాలోని అన్నీ ఆలయాల పరిసరాలను ఆదివారం శుభ్రం చేశారు. వివిధ పరిమళ పుష్పాలు, రంగురంగుల విద్యుత్ దీపాలతో దేవాలయాలను సుంద రంగా అలంకరించారు. సోమవారం ఉదయం నుంచి జిల్లాలోని రామా లయాలతో పాటు వివిధ ఆలయాల్లో అభిషేకాలు, హోమాలు, రామ భజనలు నిర్వహించేం దుకు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే పలు ధార్మిక సంస్థల ఆధ్వర్యంలో ముందస్తు రామభజనలు ప్రారంభించారు. నెల్లూరు నగరంలోనూ జిల్లా లోని ప్రధాన పట్టణాల్లోనూ అయోధ్య రాముడి కటౌట్‌లు, ఫ్లెక్సీలు వెలిశాయి. ఇప్పటికే వీహెచ్‌పీ కార్యకర్తలు జిల్లా అంతటా అయోధ్యలో పూజిం చిన అక్షితలు పంపిణీ చేశారు. రాముడి విగ్రహ ప్రతిష్ఠ అనంతరం సోమవారం సాయంత్రం ప్రతి ఇంటా దీపాలు వెలిగించాలని, రామనామకీర్తనలు ఆలపించాలని, భజనలు చేయాలని, ఇళ్లపై కాషాయ జెండాలు ఎగుర వేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు పలు ప్రాంతాల్లో ఏర్పాట్లు చేశారు.




కావలి : ట్రంకురోడ్డులో ప్రదర్శన నిర్వహిస్తున్న విశ్వహిందు పరిషత్ నాయకులు

● **నెల్లూరులో భారీగా కార్యక్రమాలు**

అయోధ్య రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా నెల్లూరు నగరంలోని సుమారు 150కిపైగా ఆలయాల్లో సోమవారం పూజలు, రామభజనలు చేయనున్నారు. శబరి శ్రీరామక్షేత్రంలో ఉదయం 6గంటలకు అభిషేకాలు, 9గంటలకు శ్రీరామహోమం నిర్వహించనున్నారు. 10 నుంచి రామభజనలు, వీణా కచేరీ, కోలాటాలు, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉదయం 11 నుంచి అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, ప్రత్యక్ష ప్రసారాన్ని ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శించనున్నారు. అలాగే సోమవారం ఉదయం 10 గంటలకు సంతపేట నాలుగుకాళ్ల మండపం నుంచి గాంధీబొమ్మ వరకు శోభాయాత్ర జరుగుతుంది. అలాగే వేదాయపాలెం, పెద్దబజారు రామమందిరాల ఆధ్వ ర్యంలో శోభాయాత్రలు ఘనంగా జరు గుతాయని నిర్వా హకులు తెలిపారు. గాంధీబొమ్మ సెంటర్, శివాజీ సెంటర్, చిన్నబ జారు రాణాప్రతాప్ సెంటర్, పప్పులవీధి ఆంజనేయ స్వామి ఆలయం, నిప్పోసెం టర్, వేదాయ పాలెంసెం టర్, భక్తవత్సల నగర్ తదితర ప్రాంతాల్లో ఎల్ఈడీ స్క్రీన్లపై అయోధ్యలో జరిగే కార్యక్రమాలను వీక్షించేం దుకు ఏర్పాట్లు చేశారు.



విద్యుత్ దీపాల వెలుగులో నెల్లూరు శబరి శ్రీరామక్షేత్రం



శోభాయాత్ర నిర్వహిస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

## వైభవంగా శోభాయాత్ర

**నెల్లూరు (విద్య) :** అయోధ్య రామాలయ పునఃనిర్మాణం, విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని సింహపురి గణేష్ ఉత్సవ కమిటీ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరులోని వేదాయపాళెం వేదగణపతి ఆలయ ప్రాంగణంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద నుంచి అయ్యప్పస్వామి గుడి మీదుగా రాజరాజే శ్వరి ఆలయం, శబరి శ్రీరామ క్షేత్రం మీదుగా వేదగణ పతి ఆలయం వరకు శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో స్థానిక యువకులు, ప్రజలు యాత్రలో పాల్గొని జై శ్రీరామ్.. జైజై శ్రీరామ్... అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు, యువతకు ట్రస్ట్ నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు. సోమవారం అయోధ్యలో ప్రాణ ప్రతిష్ఠ జరిగే సమయంలో స్థానికంగా ప్రత్యేక కార్యక్రమాలు, పూజల నిర్వహణతోపాటు అన్నదానం చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

## ఆదివాసీల అయోధ్య యాత్ర



**నెల్లూరు (సాంస్కృతికం):** శ్రీశైలం నుంచి కన్యాకుమారికి, అక్కడ నుంచి అయోధ్యకు సైకిల్ ర్యాలీ చేపట్టిన ఆదివాసీ చిన్నారులు ఆదివారం నెల్లూరుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని ఆయన స్వగృహంలో కలుసుకున్నారు. యాత్ర గురించి నిర్వాహకుడు వంశీధర్ ఆయనకు వివరిం చారు. ధృడమైన యువతను తయారు చేసేందుకు ఈ యాత్ర చేపట్టామని తెలియచేశాడు. ఈ యాత్ర విజయవంతం కావాలని వేమిరెడ్డి ఆకాంక్షించారు. అనంతరం వారికి ఆర్థిక సహాయం చేసి, యాత్రకు జెండా ఊపి ముందుకు నడిపించారు.



కందుకూరు : పామూరు రోడ్డులోని కోదండ రామాలయంలో ఆదివారం జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మహిళలు



నెల్లూరు పెద్దబజారులోని ఓ దుకాణంలో కాషాయ జెండాల విక్రయం



వరికుంటపాడు : గన్నేపల్లి పంచాయతీలోని అడవి పేరంటాలమ్మ ఆలయాన్ని శుద్ధి చేస్తున్న బీజేపీ నాయకులు

# బెదిరింపులు, నిర్బంధాలు ఆపండి !

**అంగన్‌వాడీల సమస్యలను సామరస్యంగా పరిష్కరించండి : సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి**



కలెక్టరేట్ వద్ద నిరాహారదీక్షలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్

**నెల్లూరు (వైద్యం) జనవరి 21:** అంగన్‌వాడీలపై బెదిరింపులు, నిర్బంధాలు ఆపాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు జిల్లాలో ఆదివారం నాటికి అంగన్‌వాడీల సమ్మె 41వ రోజుకు చేరుకుంది. నెల్లూరులోని కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల నిరవధిక నిరాహార దీక్ష కొనసాగుతుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలు సుదీర్ఘకాలంగా తమ డిమాండ్ల పరిష్కారం కోసం పోరాడుతుంటే ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయటం దుర్మార్గమన్నారు. సమస్యలను పరిష్కరించకుండా ఇలా నిర్బంధించడం వల్ల సమస్య మరింత జటిలమయ్యే అవకాశం ఉందన్నారు. అంగన్‌వాడీల దీక్షలను, ర్యాలీలను భగ్నం చేసేందుకు ప్రభుత్వం పోలీసుల చేత దాడులకు పాల్పడటం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఇకనైనా ప్రభుత్వం ఇలాంటి చర్యలకు స్వస్తి పలికి అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, నగర కార్యదర్శి నాగేశ్వరరావు, రూరల్ అధ్యక్షుడు కొండా ప్రసాద్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు రజని, మల్లెమ్మ, రమాదేవి, ఉష పాల్గొన్నారు.

● ఆత్మకూరులోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో అంగన్‌వాడీలు బైఠాయించి ఆదివారం కూడా సమ్మె కొనసాగించారు. వారికి సీపీఎం, సీఐటీయూ నాయకులు సంఘీభావం ప్రకటించారు.

● కావలిలో అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె ఆదివారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించేవరకు వెనకడుగు వేసే ప్రసక్తే లేదని, ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటామని వారు హెచ్చరించారు.

# పేరెంట్స్ కమిటీలకు ఎన్నికలు లేనట్టే !?

- పదవీకాలం గడుపు పొడిగింపు
- ఖాళీలు భర్తీకాక చెల్లింపుల్లో ఇబ్బందులు
- పాఠశాలల్లో హెచ్‌ఎంలు, టీచర్లకు కొత్త సమస్యలు

**నెల్లూరు (విద్య), జనవరి 21:** పాఠశాలల్లో తల్లిదండ్రుల కమిటీ పాలక వర్గాల గడువు గత డిసెంబరుతో ముగిసింది. అయితే ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా వారి పదవీకా లాన్ని పొడిగించింది. దీంతో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులకు కొత్త చిక్కులు వచ్చాయి. ఇప్పటికే ఉన్న ఖాళీలను భర్తీ చేయకపోవడంతో చెల్లింపుల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లాలో 2,688 ప్రాథమిక, 361 ప్రాథమి కోన్నత, 418 ఉన్నత పాఠశాలలు కలిపి మొత్తం 3,467 సర్కార్ స్కూళ్లు ఉన్నాయి. పాఠశాలల విలీనం, నాడు-నేడు పనులు పూర్తికాక పోవడంతో తరగతి గదుల సమస్య తలెత్తింది. దీంతో కొందరు తల్లిదండ్రులు అసౌకర్యాల నడుమ తమ పిల్లల చదువు సరిగా సాగదని ప్రైవేట్ స్కూళ్ల బాట పట్టారు. మరి కొంతమంది పాఠశాలలను విడిచి వెళ్లిపోయారు. ఇలా వెళ్లినపిల్లల తల్లిదండ్రుల్లో ఎవరైనా స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్‌గా, సభ్యులుగా ఉంటే వారిస్థానంలో కొత్తవారిని యమించుకోవాలి. ప్రతి తరగతికి ముగ్గురు చొప్పున ప్రాథమిక పాఠశాలల్లో 15 మందిని, ఉన్నత పాఠశాలల్లో 24 మందిని పాలకవర్గ సభ్యులుగా ఎన్నుకోవాలి. వైసీపీ అధికారం లోకి వచ్చాక ఈ కమిటీలో అధికార పార్టీకి చెందిన నేతలు తమ వర్గానికి చెందిన వారే చైర్మన్‌లుగా, సభ్యులుగా ఉంచేందుకు పోటీపడ్డారు. తాజా రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో



● **క్షేత్రస్థాయిలో ఇబ్బందులు**

కమిటీ చైర్మన్, హెచ్‌ఎంల పేరుతో సంయుక్త బ్యాంకు ఖాతా ఏర్పాటు చేసుకుని నాడు-నేడు నిధులు ఖర్చు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల నిర్వహణలో పేరెంట్స్ కమిటీ ప్రాధాన్యం కీలకంగా ఉంది. అయితే పాలక వర్గాల గడువు ముగిసినా ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించ కుండా పాత కమిటీల పదవీకాలాన్ని పొడిగించింది. ప్రభు త్వం నిర్ణయం తీసుకునే ముందు క్షేత్రస్థాయిలో ఉండే ఇబ్బందులను పరిగణలోకి తీసుకోలేదన్న విమర్శలు వినిపి స్తున్నాయి. అలాగే ఈ కమిటీల్లో అన్ని వర్గాల నుంచి ప్రాతి నిధ్యం కల్పించాల్సి ఉండగా, కొన్ని వర్గాలు తమకు పదవులు వద్దని తిరస్కరిస్తున్నారు. దీంతో బిల్లుల చెల్లింపులు నిలిచి పోయే అవకాశం ఉందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

ఆయా పాఠశాలల్లో ఖాళీ అయిన పదవులకు పోటీపడేవారే కరువయ్యారు. ఖాళీ అయిన చైర్మన్ స్థానాల భర్తీకి ఆపసోపాలు పడాల్సి వస్తోందని ప్రధానో పాధ్యా యులు చెబుతున్నారు. ఈ పదవులను భర్తీ చేయకుం డా పాలకవర్గాన్ని నడిపే పరిస్థితి లేదని వారంటున్నారు.

● **కార్పొరేట్లకు దీటుగా... ఒట్టిమాటే !**

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయలు కల్పించి కార్పొరేట్‌లకు దీటుగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ప్రభుత్వ చేపట్టిన కార్యక్రమాలు విమర్శలకు తావిస్తోంది. పాఠశాలల అభివృద్ధి కోట్లాది రూపాయలు వెచ్చించామని చెపుతున్నా క్షేత్రస్థాయిలో విద్యార్థుల సమస్యలు మాత్రం తీరడం లేదు. జిల్లాలో కోట్లు వెచ్చించి పాఠశాలల్లో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌లు దిష్టిబొమ్మల్లా మిగిలాయి. ఆగమేఘాలపై నూతన విద్యావిధానాన్ని అమలు చేస్తున్న ప్రభుత్వం అందుకు తగినట్లు పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించలేదు. నాడు-నేడు కింద వసతులు కల్పిస్తామని చెప్పినా అత్యధిక పాఠశాలల్లో నేటివరకు పునాదులే పడలేదు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు గదులు, మరుగుదొడ్లు, ప్రహరీ, వంటశాలలు, తాగునీరు, విద్యుత్, బెంచీలు, గ్రీన్‌బోర్డుల ఏర్పాటు తదితర వసతులు కల్పించాలని ప్రభుత్వం ఆదేశించినా నేటికీ ఈ పనులు నత్తనడకన సాగుతూనే ఉన్నాయి. పాఠశాలల నిర్వహణ కోసం విడుదల చేసే నిధులతోనే విద్యుత్, ఇంటర్‌నెట్‌బిల్లుల చెల్లింపు, ఫ్యాన్స్‌లు, వాష్‌రూమ్‌లలో ట్యాప్‌లు, పైపులు మరమ్మతులు, కంప్యూటర్‌ల రిపేర్లు చేయిస్తున్నారు. స్టేషనరీ ఖర్చుల కోసం ఈ ఏడాది కేటాయించిన బడ్జెట్‌లో కేవలం 20శాతం మాత్రమే నిధులు విడుదల చేశారు. పాఠశాలల్లో పనులకు ప్రాధాన్య తనిస్తున్నామని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పలు రకాల ఇబ్బందులు, ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఓవైపు బిల్లుల చెల్లింపులు నిలిచిపోవడం, మరోవైపు మెటీరియల్స్, సిమెంట్, ఇసుక కొరత ఏర్పడడంతో పనులు నిలిచిపోతున్నాయి. గత ఏడాది పూర్తి చేస్తామని ప్రకటించినా వచ్చే ఏడాదికి కూడా పనులు పూర్తయ్యేలా కనిపించడం లేదని తల్లిదండ్రుల కమిటీలు చెబుతున్నాయి.

## మినుముల ధర
# మటాష్ !

- పది రోజుల్లో క్వింటాల్ రేటు రూ.3 వేలు పతనం
- వ్యాపారుల సిండికేట్, దళారుల చేతివాటం
- అయోమయంలో రైతులు

**కందుకూరు, జనవరి 21:** రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన మినుములను నిలువునా దోచుకునేందుకు వ్యాపారులు సిద్ధమయ్యారు. కందుకూరు ప్రాంతంలోనే కాక జిల్లాలోని పలు ప్రాంతాల్లో వారంరోజులుగా మినుము నూర్పిళ్లు జరుగుతున్నాయి. ఈ క్రమంలో కేవలం పదిరోజుల వ్యవధిలో క్వింటాల్‌కు రూ. 3వేలు ధర తగ్గించిన వ్యాపారులు రైతుల కష్టాన్ని దోచుకునేందుకు సిద్ధమయ్యారు. మినుములకు డిమాండ్ తగ్గింది.. ఈ ధర కూడా ఎన్ని రోజులు ఉంటుందో.. ఇంకా తగ్గుతుందో ...? చెప్పలేమని దళారులతో ప్రచారం చేయిస్తూ రైతులను ఆందోళనకు గురిచేస్తున్నారు.

● **రూ.3 వేల పతనం**



పదిరోజులక్రితం వరకు క్వింటాల్ మినుములు రూ. 10వేలు నుంచి రూ. 11వేలు వరకు ధర పలుకుతూ వచ్చాయి. ఆరేడు నెలలుగా ఈ ధర స్థిరంగా కొనసాగింది. మేలురకం మినుములు క్వింటాల్ రూ. 11వేలకు కొనుగోలు జరగ్గా, సరుకు నాణ్యతను బట్టి రూ. 10వేలకు తక్కువ కాకుండా ధర పలుకుతూ వచ్చింది. అయితే అనూహ్యంగా అత్యంత నాణ్యత కలిగిన కొత్త మినుములను క్వింటాల్ రూ. 8వేలుకి కొనుగోలు చేస్తున్న వ్యాపా రులు, నాణ్యత తక్కువగా ఉంటే రూ. 7వేలకే కొంటామని చెబుతున్నారు. దీంతో పంట చేతికొస్తే మంచిధరకు అమ్ము కోవచ్చని నూర్పిళ్లు చేసిన రైతులు వ్యాపారుల మాయాజాలం తో బిక్కముఖాలు వేశారు. కొద్దిరోజులు నిల్వ చేస్తే మంచి ధర కు అమ్ముకోవచ్చన్న ఆశ ఓవైపు.. ఒకవేళ ధర ఇంకా తగ్గిపోతుం దేమోనన్న ఆందోళన మరోవైపు వారిని అయోమయానికి గురిచేస్తోంది. కందుకూరు డివిజన్‌తో పాటు ఆత్మకూరు, ఉదయగిరి, కావలి నియోజక వర్గాలలోను పెద్దఎత్తున మినుము సాగు చేయగా, ప్రస్తుతం నూర్పిళ్లు జరుగుతున్నాయి. ఈ ఏడాది డిసెంబరు మొదటివారంలో వచ్చిన మిచౌంగ్ తుఫాను మినుము రైతును తీవ్రంగా దెబ్బతీసింది. పంట పూత, కాయదశలో ఉన్న సమయంలో తుఫాను రావటంతో పంట దెబ్బతిని దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయి.



సంగంలో వైసీపీ నాయకుడు తాళం వేసింది ఈ గోదాముకే!

- జగనన్న కాలనీల్లో పక్కదారి పడుతున్న సిమెంటు
- నల్లబజారులో విక్రయించి సొమ్ము చేసుకుంటున్న వైనం
- ఓ అధికారి తీరుపై విమర్శల వెల్లువ
- గోదాముకు తాళం వేసిన వైసీపీ నేత

# గృహ నిర్మాణంలో బకాసురులు!

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న సిమెంటు బస్తాలు పక్కదారి పడుతున్నాయి. గృహ నిర్మాణ శాఖకు చెందిన కొంతమంది అధికారులే బస్తాలను నల్లబజారుకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల ఉదయగిరిలో ఓ అధికారి తన ఇంటి నిర్మాణం కోసం తరలించిన సిమెంటు బస్తాలను టీడీపీ నాయకులు గుర్తించారు. తాజాగా సంగంలో అధికార పార్టీ నాయకుడే పక్కదారి పడుతున్న సిమెంట్ బస్తాల వ్యవహారాన్ని గుర్తించి, సదరు గోదాముకు తాళం వేశాడు.

**సంగం, జనవరి 21 :** సంగం మండలంలో జగనన్న కాలనీ కోసం మొదటి విడతలో 1072 పక్కా గృహాలు మంజూరయ్యాయి. కొందరు లబ్ధిదారులు సొంతంగా ఇళ్లు నిర్మించుకుంటుండగా, మరికొందరు ముందుకురాలేదు. సదరు ఇళ్లను ఇద్దరు వైసీపీ నాయకులతోపాటు మరో కాంట్రాక్టర్‌కు ఆర్నెల్ల క్రితం నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. 1072 ఇళ్లకుగాను పునాదుల స్థాయిలో 198, బేస్‌మెంట్ స్థాయిలో 367, రూఫ్ లెవల్‌లో 151, శ్లాబ్ లెవల్‌లో 48 ఉండగా 15 ఇళ్లు పూర్తయ్యాయి. మిగిలిన 293 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాలేదు. వీటితోపాటు ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా మరో 663 పక్కాల గృహాలు మంజూరయ్యాయి. వీటిలో పునాదుల స్థాయిలో 96, బేస్‌మెంట్‌లో 49, రూఫ్‌లెవల్‌లో 29, శ్లాబు లెవల్‌లో 25 ఉండగా 10 ఇళ్లు పూర్తయ్యాయి. మిగిలిన 454 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాలేదు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.8 లక్షలు ఇస్తుంది. ఇందులోనే స్టీలు, 90 బస్తాల సిమెంట్ సరఫరా చేసి ఇందుకయ్యే ఖర్చు పోను మిగిలిన నగదును నాలుగు విడతల్లో కాంట్రాక్టర్లకు బిల్లులు అందచేస్తారు. దీంతోపాటు ఒక్కో ఇంటి నిర్మాణానికి 5 యూనిట్ల ఇసుక ఉచితంగా ఇస్తుంది.

● **17,480 బస్తాల సిమెంట్ సరఫరా**

మండలానికి ఇప్పటివరకు 17,480 బస్తాల సిమెంట్ సరఫరా అయిందని, ఇందులో 11,215 బస్తాలను ఇళ్ల నిర్మాణ కాంట్రాక్టర్లకు, లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు సీఆర్ఓ (సిమెంట్ రిలీజ్ ఆర్డర్)లను హౌసింగ్ అధికారులు చూపిస్తున్నారు. ప్రస్తుతం 1,965 బస్తాల సిమెంట్ గోదాములో నిల్వ ఉంది. మరో 1,965 బస్తాలకు కాంట్రాక్టర్ల నుంచి సీఆర్ఓలు రావాల్సి ఉన్నట్లు సమాచారం. అయినా 4300 బస్తాల సిమెంట్‌కు లెక్కలు తేలలేదు. ఈ క్రమంలో మళ్లీ 4 వేల బస్తాల సిమెంట్ గోదాముకు సరఫరా అయింది.

● **గోదాముకు తాళాలు**

కాలనీ ఇళ్లకు ప్రభుత్వం సరఫరా చేసే సిమెంట్‌లో గోల్‌మాల్ జరిగిందంటూ వైసీపీకి చెందిన ఓ నాయకుడు 4 రోజుల క్రితం గోదాముకు తాళం వేశారు. దీంతో ఇళ్ల నిర్మాణాలకు సిమెంట్ సరఫరా నిలిచిపోయి లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. కాగా, ప్రభుత్వం సరఫరా చేసే సిమెంట్ బస్తా ధర రూ.277. అదే ప్రైవేట్ మార్కెట్‌లో బస్తా రూ.350. ఈ నేపథ్యంలో సిమెంట్‌ను ఆ శాఖ సిబ్బందే బయటి మార్కెట్‌లో విక్రయిస్తున్నారని తెలియడంతో గోదాముకు తాళం వేసినట్లు వైసీపీ నాయకుడు వాసుదేవరెడ్డి చెబుతున్నారు. ఇది జరిగిన 4 రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో సిమెంట్ అక్రమాలపై వచ్చే ఆరోపణలకు బలం చేకూరుతోంది.

**4 వేల బస్తాలకు సీఆర్‌వోలు రావాలి**

4 వేల సిమెంట్ బస్తాల్లో తేడా ఉన్నమాట వాస్తవమే. అయితే మొదట్లో గోదాము అందుబాటులో లేకపోవడంతో ప్రభుత్వం నుంచి వచ్చిన సిమెంట్‌ను నేరుగా కాంట్రాక్టర్లకు సరఫరా చేశాం. వారి నుంచి సీఆర్‌వోలు రావాలి. వారే జాప్యం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం.



- కరీముల్లా, హౌసింగ్ ఏఈ

# కావలి చెరువులో ఆగని గ్రావెల్ దందా!

● యథేచ్ఛగా అక్రమ రవాణా ● చోద్యం చూస్తున్న అధికారులు



ఎక్స్‌కవేటర్‌తో ట్రిప్పరుకు లోడ్ చేస్తున్న గ్రావెల్

**కావలి, జనవరి 21:** విలువైన సహజ సంపద అక్రమంగా దోపిడీ జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. కావలి పెద్ద చెరువులో నుంచి అధికార పార్టీ నేతలు రేయింబవళ్లు గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్నారు. అధికారుల అభ్యంతరాలు ఉంటాయేమోనని తొలుత రాత్రిళ్లు మాత్రమే గ్రావెల్ తరలించేవారు. అయితే అధికారులు అధికార పార్టీకి భయపడుతున్నారో అక్రమ దందాలో వాటాలు తీసుకుంటున్నారో ఏమో కానీ గ్రావెల్ దందాకు సహకరిస్తుండటంతో పగలు కూడా యథేచ్ఛగా గ్రావెల్ తరలిస్తున్నారు. ఇతరులు ఎవరైనా అధికారుల అనుమతి లేకుండా తట్టెడు మట్టి తీస్తే రెవెన్యూ, పోలీస్, సెబ్, ఇరిగేషన్ అధికారులు పరుగులు తీసి వారిపై కేసులు పెడుతున్నారు. అయితే అధికారపార్టీ వాళ్లు యథేచ్ఛగా తరలిస్తున్నా తమకు తెలియదన్నట్లుగా ఆయా శాఖల అధికారులు మిన్నకుంటున్నారు. చదునుగా ఉన్న ప్రాంతంలో ఎక్స్‌కవేటర్లు పెట్టి పెద్దపెద్ద గుంటలు తీస్తే భవిష్యత్తులో వాటి వలన ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి వాటిని నిరోధించాల్సి ఉంది.

# బార్బర్ దుకాణంపై ఆవుల దాడి

● రూ. 20వేలు ఆస్తినష్టం



బార్బర్ దుకాణంపై దాడిచేసిన ఆవులు

**మనుబోలు, జనవరి 21:** స్థానిక కోదండ రామపురంలో ఆదివారం బాలాజీ బార్బర్ దుకాణంపై ఆవులు దాడిచేశాయి. దీంతో దుకాణం అద్దాలు పగిలిపోవడంతో దుకాణదారుడికి రూ. 20వేలు ఆస్తినష్టం వాటిల్లింది. మనుబోలులో ఆవులు దుకాణాల వద్ద, జాతీయ రహదారులపై పగలు, రాత్రి తేడాలేకుండా తిరుగుతున్నా పెంపకందారులు పట్టించుకోకపోవడం వలన రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దుకాణాల యజమానులు నష్టపోతున్నారు. ఇకనైనా పోలీసులు, పంచాయతీ అధికారులు స్పందించి ఆవుల పెంపకందారులకు జరిమానాలు విధించాలని దుకాణాల యజమానులు కోరుతున్నారు.

# ఇంట్లో కుళ్లిపోయిన మృతదేహం

**నెల్లూరు(క్రైం), జనవరి 21:** ఓ ఇంటి నుంచి తీవ్ర దుర్గంధం వెలువడుతుంటే స్థానికులు ఆ ఇంట్లో ఉండే వ్యక్తి బంధువులు, పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న బంధువులు తలుపులు పగులగొట్టి లోపల చూడగా ఓ వ్యక్తి మృతదేహం కుళ్లిపోయి కనిపించింది. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని మూలాపేట బెస్తవారిపాళేనికి చెందిన సురేష్‌రెడ్డి(55) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ, జ్యోతిషం చెప్పుకుంటూ ఒంటరిగా జీవిస్తున్నాడు. ఆయన ఇంటి నుంచి ఆదివారం తీవ్ర దుర్గంధం రావడంతో స్థానికులు మూలాపేటలో నివసిస్తున్న సురేష్‌రెడ్డి అన్న కుమారుడు అయ్యప్పరెడ్డికి, చిన్నబజారు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకుని ఇంటి తలుపులు పగులగొట్టిచూడగా సురేష్‌రెడ్డి మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో కనిపించింది. మృతిచెంది మూడు రోజులకుపైనే అయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. అయ్యప్పరెడ్డి ఫిర్యాదు మేరకు కేసును విచారిస్తున్నామని, అనారోగ్యమే సురేష్‌రెడ్డి మృతికి కారణమని చిన్నబజారు ఎస్‌ఐ సైదులు తెలిపారు.

# ఊట బావిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



ఊట బావిలో నీటిపై తేలాడుతున్న మృతదేహం

**అల్లూరు, జనవరి 21 :** ఊట బావిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని ఆదివారం స్థానికులు గుర్తించారు. ఎస్‌ఐ శ్రీనివాసులురెడ్డి కథనం మేరకు.. మండలంలోని కొత్తసింగపేట గ్రామ పొలాల్లోని ఊట బావిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్టు అందిన సమాచారంతో ఎస్‌ఐ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహం ఉబ్బిపోయి గుర్తుపట్టలేని విధంగా ఉంది. మృతుడు 35 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు ఉండవచ్చని భావిస్తున్నారు. మృతుడు ముదురు ఆకుపచ్చ రంగు షాట్ ధరించి ఉన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

# దాడి చేశారంటూ ఫిర్యాదు



చేజర్ల పోలీస్ స్టేషన్ వద్ద బాధితులు

**చేజర్ల, జనవరి 21:** తమపై దాడి చేశారంటూ మండలంలోని నాగులవెల్లటూరు గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన బొర్రా చంద్రమౌళి వారి కుటుంబ సభ్యులు స్థానిక వైసీపీ నాయకుడు రవీంద్ర నాయుడు, అతని కుమారుడు రవితేజపై ఆదివారం చేజర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నాగులవెల్లటూరు గ్రామ పరిధిలోని సర్వే నెం.101-3లో ఉన్న తమ పొలంలో ఆదివారం ఉదయం పనులు చేస్తున్న సమయంలో రవీంద్రనాయుడు, అతని కుమారుడు రవితేజలు వచ్చి దుర్భాషలాడుతూ మహిళలు అని కూడా చూడకుండా తమపై దాడికి పాల్పడినట్లు తెలిపారు. గతంలో తమ పొలాన్ని కొనేందుకు మధ్యవర్తుల ద్వారా సంప్రదించారని, అయితే తాము ఒప్పుకోకపోవడంతోనే ఈ దాడులకు పాల్పడుతున్నారన్నారు. కాగా, దాడి సంఘటన తన ఫోన్‌లో రికార్డు చేస్తుండగా రవితేజ ఫోన్ లాక్కుని పక్కనే ఉన్న చెక్‌డ్యాంలో పడవేసినట్లు బాధితులు తెలిపారు. ఈ సంఘటన జరిగిన వెంటనే చేజర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. ఈ సంఘటనపై చేజర్ల ఎస్‌ఐ ప్రభాకర్‌ను వివరణ కోరగా గ్రామంలో విచారించి కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

# షార్ట్ సర్క్యూట్‌తో 12 గుడిసెల దగ్ధం



మంటల్లో కాలిపోయిన వస్తువులు

**మర్రిపాడు, జనవరి 21 :** విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో 12 గుడిసెలు దగ్ధమైన సంఘటన శనివారం అర్ధరాత్రి డీసీపల్లిలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ఒంగోలు జిల్లాకు చెందినవారు డీసీపల్లికి పొగాకు సీజన్ కూలీలుగా వచ్చి గుడిసెలు ఏర్పాటు చేసుకొని అందులో నివసిస్తున్నారు. శనివారం రాత్రి వారు గుడిసెల్లో నిద్రపోతుండగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అర్ధరాత్రి మంటలు చెలరేగాయి. దీంతో గుడిసెల్లో నుండి తమ పిల్లలను తీసుకొని బయటకు పరుగులు తీశారు. మర్రిపాడు అగ్నిమాపక వాహనం వచ్చి మంటలు ఆర్పే యత్నం చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. బట్టలు, వస్తువులు మొత్తం కాలి బూడిదయ్యాయి. కట్టుబట్టలతో బయటకు వచ్చి ప్రాణాపాయం నుండి తప్పించుకున్నారు. లక్ష రూపాయల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు.

## చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో |
|---|---|
| బాయిలర్ లైవ్ | 110 |
| లేయర్ లైవ్ | 85 |
| స్కిన్ చికెన్ | 200 |
| స్కిన్‌లెస్ | 220 |
| లేయర్ | 145 |

## బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

| | |
|---|---|
| ఒక గ్రాము ధర | రూ. 5953 |
| వెండి కిలో ధర | రూ. 73,000 |
| వెండి ఒక గ్రాము | రూ. 75.00 |

# కారు, మోటారు బైక్ ఢీ

● ఒకరికి గాయాలు



గాయపడిన ఖాజారసూల్

**సంగం:** కారు, మోటారు బైక్ ఢీకొని ఒకరికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని కొరిమెర్ల వద్ద కలిగిరి రహదారిలో ఆదివారం రాత్రి జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ఏయస్‌పేట మండలం అక్బరాబాద్ గ్రామానికి చెందిన ఖాజా రసూల్ మోటారుబైక్‌పై సంగం వైపు వస్తుండగా మార్గమధ్యంలో కొరిమెర్ల రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో మోటారుబైక్‌పై వస్తున్న ఖాజారసూల్‌కి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతడిని 108 వాహనంలో ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అసైన్డ్ భూములకు బేరం

● రికార్డుల మార్పు కోసం పైరవీలు
● అధికారులపై ఒత్తిడి
● తమవారికే దక్కేలా అధికారపార్టీ నేతల యత్నాలు



వరికుంటపాడు తహసీల్దారు కార్యాలయం

**వరికుంటపాడు, జనవరి 21:** వైసీపీ ప్రభుత్వంలో అమలవుతున్న పథకాలు అర్హులయిన లబ్ధిదారులకు ఎంతవరకు అందుతున్నాయోగానీ, సంపాదించుకున్నోళ్లకు సంపాదించుకున్నంత అన్న పరిస్థితులు నెలకొన్నాయి. నిన్నటి వరకు క్వార్ట్జ్, ఇసుక తరలింపుతో జేబులు నింపుకున్న అధికారపార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తాజాగా జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకాన్ని ఆదాయ వనరుగా మార్చుకున్నారు. ఈ పథకం కింద జిల్లా వ్యాప్తంగా 28,372 మంది రైతులకు 45,493 ఎకరాల అసైన్‌మెంట్ భూములను 22-ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించి పూర్తి హక్కులు కల్పిస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. అలాగే భూమి లేని మరో 4,195 మంది రైతులకు 4,344 ఎకరాలను అసైన్‌మెంట్ కమిటీ ద్వారా పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతున్నామని కూడా ప్రకటించారు.

**● హక్కులు కల్పిస్తామని చెప్పి...**

కాగా 20ఏళ్లకు పైబడి డీకేటీ పట్టా భూములను సాగు చేసుకుంటున్న రైతులకు శాశ్వత భూహక్కులు కల్పిస్తామని చెబుతున్నా, ఆచరణలో మాత్రం పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ఈ అంశాన్ని ఆసరాగా చేసుకున్న అధికార పార్టీ నాయకులు సాగులో లేని ప్రభుత్వ భూములపై కన్నేసి రికార్డుల తారుమారుకు పైరవీలు చేస్తున్నారు. అసైన్‌మెంట్ భూములను సాగు చేసుకుంటున్న రైతుల సంగతి ఏమోగానీ, ఏనాడూ అటువైపు కన్నెత్తి చూడని నాయకులు, వారి పేరుపై ఉన్న భూములను కాజేసేందుకు యత్నిస్తున్నారు.

**● భూముల కొనుగోళ్ల యత్నం**

జిల్లాలో మారుమూల మండలమైన వరికుంటపాడులో ఇలాంటి దందా మరింత ఎక్కువగా ఉంది. మండలంలోనూ 1,768 మంది రైతులకు 3,608.83 ఎకరాలకు భూహక్కు కల్పించనున్నారు. అలాగే సుమారు 1,800 మంది రైతులు తమకు భూమి లేదని అందించిన దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి. సాగునీటి వనరులు, జాతీయ రహదారులను సాకుగా చూపుతున్న నాయకులు స్థానిక ప్రజాప్రతినిధులతో కుమ్మక్కై, నేల స్వభావం, ప్రాంతాన్ని బట్టి భూములకు ధరలు నిర్ణయించి కొనుగోలుకు బేరాలు సాగిస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో నివాసాలు ఉంటున్న వారితో సహా ఎలాంటి వ్యవసాయ అనుభవం లేని వారికి సైతం ఆశ చూపి ఎకరాకు రూ. 20 నుంచి రూ. 30వేల వరకు నగదు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. అలాంటి వారి పేర్లతో పంచాయతీల వారీగా జాబితాలు తయారు చేసి రెవెన్యూ అధికారులకు అందచేశారు. కేవలం ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్న వారికి సెటిల్డ్ భూమిగా మార్పు చేయాలనే నిబంధనను తుంగలో తొక్కి అనర్హులే సాగులో ఉన్నట్లు రికార్డుల్లో నమోదు చేసేందుకు ముమ్మరంగా పైరవీలు సాగిస్తున్నారు. అయితే ఓ దశలో అధికారపార్టీ నాయకుల ఒత్తిడికి తలొగ్గని తహసీల్దారుతో నేతలు వాగ్వివాదం చేసినట్లు సమాచారం. దీంతో తమ వారికి న్యాయం చేయాలని ఇటీవల వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి నేరుగా కార్యాలయానికి చేరుకొని తహసీల్దారుతో చర్చలు జరిపినట్లు తెలిసింది. అప్పటి నుంచి రాత్రిళ్లు ఆ కార్యాలయంలో సందడి నెలకొందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**● అధికారుల చేతివాటం**

ఈ విషయంలో రెవెన్యూ అధికారులు సైతం చేతివాటం ప్రదర్శిస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఎన్నికల సమయం ఆసన్నమవడంతో భూపంపిణీ జరగడం అనుమానాలకు తావిస్తున్నా, ఏళ్ల తరబడి భూములు సాగు చేసుకుంటున్నారనే తప్పుడు నివేదికలతో భూములు కాజేసేందుకు కుట్ర పన్నుతున్నారు. అంతేకాక ఇటీవల అర్హులుగా గుర్తించిన లబ్ధిదారులకు కార్యాలయ ప్రాంగణంలోనే మేకపాటి భూహక్కు పత్రాలు పంపిణీ చేశారు. అనంతరం కొంతమంది రైతుల నుంచి అధికారులు వలంటీర్ల ద్వారా నగదు వసూళ్లకు పాల్పడ్డారని తెలిసింది.

**రైతుల ఆందోళన**

ఈ నేపథ్యంలో కొంతమంది నాయకులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ సాగులో ఉన్న భూములను సైతం రద్దు చేయించేందుకు పూనుకుంటున్నారు. ఇలాంటి సంఘటనే నార్త్‌కొండాయపాళెం పంచాయతీలో తలెత్తింది. దీంతో కొంతమంది రైతులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక నిఘా ఉంచి నిజమైన అర్హులకు న్యాయం చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ఆందోళన చేస్తున్న రైతులు(ఫైల్)

# ఆకట్టుకున్న డాగ్ షో !

● ఓవరాల్ చాంపియన్ మిమీ సోమరేలియన్



పోటీలో పాల్గొన్న శునకాలు

**నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 21 :** నెల్లూరు వీఆర్ హైస్కూల్ మైదానంలో ఆదివారం నెల్లూరు కెనల్ క్లబ్ 24వ శునకాల అందాల పోటీలు(డాగ్ షో) జరిగాయి. ఈ పోటీలకు నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కుక్కల్ని పెంచుతున్నామని తెలిపారు. పెంపుడు కుక్కల యజమానులను ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రోత్సహించడం పట్ల కెనాల్ క్లబ్ కార్యవర్గాన్ని అభినందించారు. ఈ పోటీల్లో మొత్తం 102 జాతుల శునకాలు పాల్గొన్నాయి. నెల్లూరు నగరంతోపాటు చిలకలూరిపేట, తిరుపతి తదితర ప్రాంతాల నుంచి శునకాలు వచ్చాయి. సెమీఫైనల్, ఫైనల్ పోటీలు నిర్వహించి ఓవరాల్ చాంపియన్స్‌గా ఐదు శునకాలను ఎంపిక చేశారు. సాయంత్రం జరిగిన బహుమతి ప్రధానోత్సవానికి పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ మహేశ్వరుడు పాల్గొన్నారు.

**● విజేతలు..**

ఓవర్‌ఆల్ చాంపియన్‌గా మిమీ సోమరేరియన్, ద్వితీయ బహుమతిని జర్మన్ షపర్డ్, తృతీయ బహుమతిని జర్మన్‌షపర్డ్, 4వబహుమతిని డాబర్‌మ్యాన్, 5వ బహుమతిని సైబేరియన్ హస్కీ పొందాయి. ఈ పోటీలకు వచ్చిన శునకాలకు నేషనల్ ఎగ్ కో ఆర్డినేషన్ కమిటీ మాజీ చైర్మన్ ఎన్.బలరామయ్యనాయుడు, హైటెక్ ఫార్మా అధినేత ఎస్‌వి.రమణారెడ్డిలు ఉచితంగా ఉడకబెట్టిన కోడిగుడ్లు పంపిణీ చేశారు. న్యాయ నిర్ణేతగా కోయంబత్తూర్‌కి చెందిన డాక్టర్ సుధాకర్ వ్యవహరించారు. ఈ కార్యక్రమాలను క్లబ్ చైర్మన్ బొబ్బా శ్రీనివాసయాదవ్, కార్యదర్శి సురేంద్ర, డాక్టర్ వెంకటస్వామిరెడ్డి పర్యవేక్షించారు.

# నేటి నుంచి మాదిగ పల్లెల్లో పర్యటన

● సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పందిటి సుబ్బయ్య మాదిగ

**నెల్లూరు (హర నాథపురం), జనవరి 21 :** జిల్లాలోని అన్ని మాదిగ పల్లెలో సోమవారం నుంచి పర్యటించి మాదిగ లను రాజకీయంగా చైతన్యవంతులను చేస్తామని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాదిగ తెలిపారు. ఆదివారం నెల్లూరులోని అంబేద్కర్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. వచ్చే నెల 10న నెల్లూరులోని నర్తకి సెంటర్ లో మాదిగల యుద్ధ భేరి మహాసభ, ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆ సభ విజయ వంతానికి మాదిగ పల్లెల్లో పర్యటించనున్నామన్నారు. మాదిగలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించిన పార్టీలకే ఈ ఏడాది ఎన్నికల్లో ఓటు వేస్తామని స్పష్టం చేశారు. కులగణనలో మాదిగలు తమ వివరాలు చెప్పేటప్పుడు కేవలం ఎస్సీలమని చెప్పవద్దని, మాదిగలమని చెప్పాలని కోరారు. ఈ సమావేశంలో ఆల్‌ఇండియా ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీస్ యునైటెడ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కుడుముల సుబ్బారావు, నాయకులు గడ్డం శేఖర్, బద్దెపూడి వెంకటరావు, సితారి రత్నయ్య, పీ చిన్నయ్య, ఐ మల్లికార్జున, సాల్మన్ పాల్గొన్నారు.

## కోడి కత్తి శ్రీనును విడుదల చేయకుంటే

# జగనన్న ప్యాలెస్‌ను ముట్టడిస్తాం

● అంబేద్కర్ విగ్రహం వద్ద దళితుల ధర్నా



అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న దళిత నేతలు

**కావలి, జనవరి 21:** కోడి కత్తి శ్రీను విడుదలకు జగన్ సహకరించకుంటే దళిత నేతలతో కలిసి జగనన్న ప్యాలెస్‌ను ముట్టడిస్తామని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి తెలిపారు. ఈ మేరకు ఆదివారం కావలి పట్టణంలోని బ్రిడ్జి సెంటర్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేసి విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లి మాట్లాడుతూ జగన్ దళిత పక్షపాతి అయితే వెంటనే కోర్టుకు వెళ్లి సాక్ష్యం చెప్పి కోడికత్తి శ్రీను విడుదలకు సహకరించాలని, వారి కుటుంబానికి రక్షణ కల్పించాలన్నారు. రాజకీయ ప్రయోజనాలతో ఎన్నికల్లో ఓట్ల కోసం జగనన్న అమాయకుడైన కోడికత్తి శ్రీనును జైలు పాలు చేయడంతో ఆరేళ్ల నుంచి విశాఖ జైలులో మగ్గి పోతున్నాడన్నారు. కొన్ని రాజకీయ పరిస్థితుల వలన ఆయనకు బెయిలు కూడా రావడంలేదన్నారు. నా దళితులని అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ వద్ద పదే పదే చెప్పిన జగన్మోహన్‌రెడ్డి దృష్టిలో కోడి కత్తి శ్రీను దళితుడు కాదా అని ప్రశ్నించారు. శ్రీను విడుదల కోసం వారి తల్లిదండ్రులు విజయవాడలో ఆందోళన చేపడితే పోలీసులతో షామియానా పీకించి వారిని స్టేషన్‌కు తరలించి నిర్బంధించారన్నారు. దళితుల అణచివేత దాదాపు 5 ఏళ్లుగా కొనసాగుతోందన్నారు. ఉన్నత న్యాయస్థానాలు జోక్యం చేసుకుని ప్రతి పేదవానికి న్యాయం జరిగేట్లు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు జరుగుమల్లి విజయరత్నం, గిరిజన నాయకుడు చౌటూరి లక్ష్మయ్య, దళిత నేతలు ముక్క మోహన్ రావు, ఆలూరు బ్రహ్మయ్య, కుందుర్తి లక్ష్మయ్య, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా పముజుల హరి



పముజుల హరి

**నెల్లూరు రూరల్, జనవరి 21 :** ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నెల్లూరు రూరల్ మండలం సౌత్ మోపూరు గ్రామానికి చెందిన పముజుల హరి ఎంపికయ్యారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో ఆదివారం జరిగిన 13వ రాష్ట్ర మహాసభల్లో నూతన కమిటీ ఎంపిక జరిగిందని హరి తెలిపారు. ప్రస్తుతం సంఘం జిల్లా అధ్య క్షుడిగా కొనసాగుతున్న ఆయనకు రాష్ట్ర సహాయ కార్య దర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. నేత బజార్లు ఏర్పాటు చేసి, నేత పనికి ఆదరణ కల్పించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని చెప్పారు. చేనేత పరిశ్రమను ప్రోత్సహించే దిశగా పాలకులు కార్మి కులకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు.

## సాయికృష్ణ యాచేంద్రకు వేమిరెడ్డి పరామర్శ

**నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 21 :** వెంకటగిరి మాజీ శాసన సభ్యుడు, తిరుమల ఎస్వీబీసీ చానల్ చైర్మన్ సాయికృష్ణ యాచేంద్రను ఆయన స్వగృహంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. యాచేంద్ర ఆరోగ్యం గురించి వాకబు చేశారు. ఈ సందర్భంగా వేమిరెడ్డిని యాచేంద్ర సత్కరించారు.

## వైసీపీ నుంచి సూరా శ్రీనివాసులురెడ్డి సస్పెన్షన్

**బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 21:** వైసీపీ నాయకుడు సూరా శ్రీనివాసులురెడ్డిని ఆ పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు మండల కన్వీనర్ సతీష్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఆయన పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతుండడంతో సస్పెండ్ చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

## బాలిక అదృశ్యంపై కేసు నమోదు

**బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 21:** బుచ్చిరెడ్డిపాళెంలోని 14వ వార్డు పరిధిలో ఓ బాలిక అదృశ్యం అయినట్లు బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహేంద్ర తెలిపారు. బాలిక అదృశ్యంపై ఆదే ప్రాంతంలోని ఓ వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేశారని, ఆ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

## ఉదయగిరి సెబ్ సీఐగా రమణమ్మ

**ఉదయగిరిరూరల్, జనవరి 21:** ఉదయగిరి సెబ్ సీఐగా ఆదివారం ఆర్‌వీ రమణమ్మ బాధ్యతలు స్వీకరించారు. ఆమె పలనాడు జిల్లా పొందుగుల చెక్ పోస్టు నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ పరిధిలోని అన్ని మండలాల్లో నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉద్యోగులు, ప్రజలు తమవంతు బాధ్యతగా సహకరించాలని కోరారు.

# వైసీపీకి రజకులపై ప్రేమలేదు

● రజకుల చైతన్య సభలో టీడీపీ నాయకులు



జ్యోతి ప్రజ్వలన చేసి, రజకుల చైతన్య సభను ప్రారంభిస్తున్న అజీజ్

**నెల్లూరు(వ్యవసాయం), జనవరి 21 :** వైసీపీకి రజకులపై ప్రేమ లేదని, ఉంటే తాను మేయర్‌గా ఉన్న సమయంలో రూ.2 కోట్లతో మోడ్రన్ దోబీ ఘాట్ నిర్మాణానికి కృషి చేస్తే దాన్ని వైసీపీ నిర్వీర్యం చేసిందని టీడీపీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ విమర్శించారు. అంతేకాకుండా ఆదరణ పథకం కింద ఇచ్చిన పనిముట్లను తుప్పు పట్టించేవారు కాదన్నారు. నగరంలోని పోలంరెడ్డి గార్డెన్స్‌లో ఆదివారం టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గంజాం రాఘవేంద్ర ఆధ్వర్యంలో రజకుల చైతన్య సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన అజీజ్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం వచ్చాక నెల్లూరులో రజక భవనం నిర్మాణానికి కృషి చేస్తానని దోబీ ఘాట్లకు మరమ్మతులు చేయించి ఆధునిక పరికరాలను అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు ప్రశ్నించడం అలవాటు చేసుకోవాలని, లేదంటే ఏ సామాజిక వర్గానికీ మంచి జరగదన్నారు. ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ రజకులంతా ఐకమత్యంగా ఉండాలన్నారు. వారికి ఏ సమస్య వచ్చినా తీర్చడానికి ముందుంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో రజక సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ గుర్రపుశాల రామకృష్ణ, ప్రముఖ న్యాయవాది శ్రీధర్, పొదిలి శ్రీనివాసులు, కప్పిర శ్రీనివాసులు, గంధం బాబు, యానాదయ్య, గంధం అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

# రంగనాథస్వామి ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేసిన ధర్మకర్తల మండలి సభ్యులు

**నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 21 :** నెల్లూరులోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం దేవస్థానం కల్యాణ మండపంలో జరిగింది. ముఖ్య అతిథిగా నెల్లూరు నగర ఎమ్మెల్యే డాక్టర్ పీ అనిల్ కుమార్ యాదవ్ హాజరయ్యా రు. దేవుని సేవ పూర్వజన్మ సుకృతం వల్లే లభిస్తుందన్నారు. ఏపీ రాష్ట్ర ఎడిబుల్ ఆయిల్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి మాట్లాడుతూ రంగనాథస్వామి ఆలయం చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు నిబద్ధత కలిగిన వ్యక్తి అన్నారు. భక్తులకు సేవతోపాటు ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు తెలిపారు. ఆలయ ఈవో డబ్బుగుంట వెంకటేశ్వర్లు ధర్మకర్తలందరితో ప్రమాణం చేయించారు. చైర్మన్‌ను జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్ అధ్యక్షుడు దాసా లక్ష్మీనారాయణ, ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అమరా మోహన్‌రావు, పట్టణ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కందుకూరి చెంగయ్య ఆచారి, వెలుగొండయ్య తదితరులు సత్కరించారు.

# ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటాం

**అంగన్‌వాడీల ఆందోళన**



కావలి టౌన్ : నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు



ఆత్మకూరు: నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

**కావలి టౌన్, జనవరి 21:** సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు చేస్తున్న సమ్మె ఆదివారం 41వ రోజుకు చేరింది. అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నేతలు రఘురావమ్మ, సుభాషిణి, విజలయతలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలని నిలబెట్టుకోమని మహిళలు 41రోజుల నుంచి సమ్మె చేస్తుంటే ముఖ్యమంత్రికి చీమకుట్టినట్టు కూడా లేకుండా మొండి వైఖరి అవలంబిస్తున్నారని ఆరోపించారు. చలో విజయవాడ తలపెడితే అర్ధరాత్రి ఇళ్లకొచ్చి నోటీసులు తీసుకోవాలని వత్తిడి చేసి నోటీసులు ఇవ్వడం దుర్మార్గమన్నారు. వెనకడుగు వేసే ప్రసక్తే లేదని, ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటామని, ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

**ఆత్మకూరు:** తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. ఆదివారం వారు విధులను బహిష్కరించి ఆత్మకూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట ఏర్పాటుచేసిన ప్రత్యేక శిబిరంలో బైఠాయించి సమ్మెను కొనసాగించారు. వీరికి మద్దతుగా సీపీఎం, సీఐటీయు నాయకులు జి లక్ష్మపతి, ఆత్మకూరు నాగయ్య, జి శివప్రసాద్ శిబిరానికి విచ్చేసి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమ్మెతో అంగన్‌వాడీలు మూతపడడంతో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందక ఇబ్బందులు పడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని విమర్శించారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కమిటీ ప్రధాన కార్యదర్శి పి రాధ, పలువురు సెక్టార్ లీడర్లు కె రమణమ్మ, కామేశ్వరి, జమీల, విజయలక్ష్మీ, రూతమ్మ, విజయలక్ష్మీ, శ్రీదేవి, ఏ మస్తానమ్మ, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

## కాజ్‌వే, రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



కాజ్‌వే, రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

**ఆత్మకూరు, జనవరి 21 :** మండలంలోని వెన్నవాడ-గండ్లవీడు మధ్యన బొగ్గేరుపై కాజ్‌వే, రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజల ఇబ్బందులను తీరుస్తామని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన గండ్లవీడులో బొగ్గేరుపై కాజ్‌వే నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన గండ్లవీడులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ వీటి నిర్మాణ పనులు పూర్తయితే నాలుగు మండలాల్లోని 40 గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు పెమ్మసాని ప్రసన్నలక్ష్మీ, మున్సిపల్ వైస్‌చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, వైసీపీ నాయకులు కొల్లి దొరస్వామినాయుడు, ఆత్మకూరు సొసైటీ చైర్మన్ సానా వేణుగోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వై మోహన్‌రెడ్డి, వైసీపీ ఆత్మకూరు పట్టణ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనందరెడ్డి, మండల కన్వీనర్ చిట్టమూరి జితేంద్రనాగ్‌రెడ్డి, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

**హసనపురంలో విజయీభవ యాత్ర**

**ఏఎస్ పేట:** మండలంలోని హసనపురం గ్రామంలో ఆదివారం ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి విజయీభవ యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముందుగా డా. బీఆర్ అంబేద్కర్, డా వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విజయీభవ ప్రచార యాత్ర ప్రారంభిచారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పందిళ్లపల్లి రాజేశ్వరమ్మ, రాజవోలు సొసైటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదలకు దుప్పట్ల పంపిణీ

**సీతారామపురం, జనవరి 21 :** మండల పరిధిలోని దేవమ్మ చెరువు, పంద్రంగి గ్రామాలలోని నిరుపేద ఎస్టీలకు దాసరి వీరయ్య తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆది చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఆదినారాయణ, పాండురంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ ఆధ్వర్యంలో 'జయహో బీసీ'



మాట్లాడుతున్న ప్రభాకర్‌రాజు

**సీతారామపురం, జనవరి 21:** సీతారామపురం గ్రామ పంచాయతీలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం టీడీపీ మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని బీసీ కులాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రాజు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బీసీలకు ఇస్తున్న ప్రాధాన్యతను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మద్దినేని ఆదినారాయణ, శేఖర్, పిన్నిబోయిన రమణయ్య, తురక వెంకటేశ్వర్లు, మండల ముస్లిం అధ్యక్షుడు పెద్దగౌసు, బీసీ సంఘం నాయకులు, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పేరంటాలమ్మ ఆలయం శుద్ధి

**ఉదయగిరిరూరల్, జనవరి 21:** మండలంలోని గన్నేపల్లి పంచాయతీలో ఉన్న అడవి పేరంటాలమ్మ ఆలయాన్ని ఆదివారం బీజేపీ నాయకులు శుద్ధి చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కన్వీనర్ కదిరి వెంకటరంగారావు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆలయాల పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా ఆలయంతో పాటు రామాలయ ప్రాంగణాన్ని సైతం శుభ్రం చేయడం జరిగిందన్నారు. ప్రతిఒక్కరూ నివాసాలతో సహా ఆలయాల్లో శ్రీరామ జ్యోతిని వెలిగించాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెంకటస్వామి నాయుడు, ఆవుల రోశయ్య, మేకపాటి మాల్యాద్రినాయుడు, గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ నేతలను పరామర్శించిన వేలూరు



పోలిరెడ్డిని పరామర్శిస్తున్న వేలూరు కేశవచౌదరి

**చేజర్ల, జనవరి 21:** అనారోగ్యంతో బాధపడుతూ ప్రస్తుతం కోలుకుంటున్న పలు గ్రామాల టీడీపీ నాయకులను మండల టీడీపీ సీనియర్ నాయకుడు వేలూరు కేశవచౌదరి ఆదివారం పరామర్శించారు. తిరుపతి నాయుడుపల్లి గ్రామానికి చెందిన నూతక్కి రామానాయుడు, గాలిపాళెం గ్రామానికి చెందిన ఓరుగంట రమేష్, ఎన్‌వి కండ్రిక గ్రామానికి చెందిన ముప్పే పోలిరెడ్డిలను ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రామానాయుడు, తిరుపతినాయుడు, శ్రీనివాసచౌదరి, ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయ భవనం ప్రారంభం

**ఉదయగిరి, జనవరి 21 :** మండల పరిధిలోని క్రిష్ణంపల్లి, అర్లపడియ పంచాయతీల సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్‌క్లినిక్ భవనాలను వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మోడి రామాంజనేయులు, సర్పంచ్ అక్కి ప్రమీల, మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి, అక్కి భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**రోడ్డు మరమ్మతు పనుల పరిశీలన**

మండల పరిధిలోని బండగానిపల్లి షూట్ రోడ్డు మరమ్మతు పనులను ఆదివారం వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పరిశీలించారు. దెబ్బతిన్న గ్రావెల్ రోడ్డు మరమ్మతులు చేయాలని ప్రజల విన్నపాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అధికారులకు సూచించారు.

# జనసేన, టీడీపీ విజయానికి కృషి చేయాలి : బొల్లినేని



పరికుంటపాడు: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొల్లినేని

**పరికుంటపాడు, జనవరి 21:** ఎన్నికల్లో జనసేన, టీడీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, అధికారం ఉందనే అహంకారంతో టీడీపీ కార్యకర్తలను ఇబ్బందులు పెట్టిన వైసీపీ గుండాల అంతుచూస్తానని మాజీ శాసనసభ్యుడు బొల్లినేని వెంకటరామారావు అన్నారు. ఆదివారం తోటలచెరువుపల్లిలో బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సైకో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే ప్రజావేదికను కూల్చివేయడంతో పాటు పోలవరం, అమరావతి పనులను నిలిపివేసి కక్ష సాధింపులకు పాల్పడడం దారుణమని మండిపడ్డారు. నాసిరకం మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధిపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నారా అంటూ సవాల్ విసిరారు. తాను అధికారం చేపట్టిన వెంటనే సాతువారిపల్లి-తోటలచెరువుపల్లి గ్రామాలకు అనుకూలంగా రహదారి నిర్మిస్తానని హామీనిచ్చారు. అనంతరం వైసీపీ నుంచి పార్టీలో చేరిన వందమందికి కండువాలు వేసి ఆహ్వానించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచి ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు, పఠాన్ రసూల్, చంద్ర ఉమామహేశ్వరరావు, పోకా మహేష్, చంద్ర వెంకయ్య, పోలిబోయిన శ్రీకాంత్, ముజ్జె లక్ష్మి నారాయణ, కొమ్మలపాటి జనార్ధన్, సుంకే సభాపతి, నూల శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, షేక్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

**వింజమూరు:** వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ శాసన సభ్యుడు, తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ బొల్లినేని వెంకటరామారావు పేర్కొన్నారు. ఆదివారం వింజమూరు పట్టణంలో సుజాత నగర్‌లో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ ప్రజాదీవెన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తపై పన్నువేసిన చెత్త ముఖ్యమంత్రిగా జగన్ చరిత్రలో నిలిచిపోయారన్నారు. టీడీపీ ఏ చార్జీలూ పెంచలేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గొంగటి రఘునాథరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ దంతులూరు వెంకటేశ్వరరావు, పార్లమెంటు నియోజకవర్గ కార్యదర్శి చల్ల వెంకటేశ్వరరావు, గణపం సుదర్శన్‌రెడ్డి, కోడూరు నాగిరెడ్డి, గూడా సర్సారెడ్డి, ఎమ్మెస్ నాయుడు, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, బూత్ ఇన్‌చార్జ్‌లు, తదితరులు పాల్గొన్నారు.



## క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న చేజర్ల

**దుత్తలూరు(ఉదయగిరిరూరల్), జనవరి 21:** మండలంలోని బైరవరంలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచి ప్రథమ స్థానం సాధించిన జట్టుకు చేజర్ల సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్టు అధినేత చేజర్ల సుబ్బారెడ్డి ట్రోఫీతో సహా రూ. 30వేల నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో గువ్వల శేఖర్‌రెడ్డి, పోలు పుల్లారెడ్డి, చేజర్ల సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## పాఠశాల భవనం స్వాధీనం

**సంగం, జనవరి 21:** సంగం పంచాయతీ మజరా వెంకటేశ్వరపురంలో ఉన్న మూసేసిన పాఠశాల భవనాన్ని ఎంఈవో జానకిరామయ్య ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. విద్యార్థులు లేక పాఠశాలను 20 ఏళ్ల కిందట మూసేశారు. అయితే పాఠశాల భవనంలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వ్యవసాయ పనిముట్లతోపాటు దేవుడి విగ్రహాన్ని భద్రపరిచి ఉన్నారు. దీంతో దీనిపై గ్రామానికి చెందిన సుభాస్కర్ అనే వ్యక్తి పాఠశాల భవనం ఆక్రమణకు గురైందని స్పందనలో ఫిర్యాదు చేశారు. ఆమేరకు ఎంఈవో అందులో ఉన్న సామగ్రిని తీసేసి తాళాలు తీసుకుని భవనం స్వాధీనం చేసుకున్నారు.





మాట్లాడుతున్న మాలేపాటి సుబ్బానాయుడు

# దోచుకోవడం తప్ప ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి శూన్యం

- టికెట్ విషయంలో అధిష్ఠానం నిర్ణయం శిరోధార్యం
- టీడీపీ కావలి ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు

**కావలి, జనవరి 21:** కావలి ఎమ్మెల్యేగా 10 ఏళ్ల పనిచేసిన రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి కావలికి ఏమి చేశాడో చెప్పాలని టీడీపీ కావలి ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు ప్రశ్నించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గెలుపొందిననాటి నుంచి కావలి అభివృద్ధిని విస్మరించి దొరికినకాడికి దోపిడీ చేశారన్నారు. కాలువలు, వాగులు, వంకలు, గుంటలు, శ్మశానాలు.. ఇలా కనిపించిందల్లా సుమారు 100 ఎకరాలు ఎమ్మెల్యే ప్రోద్బలంతో వారి అనుచరులు ఆక్రమించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారని, వాటన్నింటిలో ఎమ్మెల్యేకు పరోక్షంగా, ప్రత్యక్షంగా వాటాలు ఉన్నాయని ఆరోపించారు. ఈ ఆక్రమణలకు సంబంధించిన వివరాలను ఆధారాలతో సహా టీడీపీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లామన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ జాబితా బయటపెట్టి అవినీతిపరులపై చర్యలు చేపడుతామన్నారు. కావలి ఆర్డీవో దోపిడీ ఎక్కువైందన్నారు. రోజూ వందల ట్రిప్పుల గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్నా పట్టించుకోవడంలేదన్నారు. వీటికి బాధ్యులైన అధికారులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

**టికెట్ ఆశిస్తున్నా... :** తాను రెండున్నరేళ్లుగా నియోజకవర్గంలో టీడీపీ బలోపేతానికి కష్టపడినందున కావలి నుంచి పోటీ చేసేందుకు టికెట్ ఆశిస్తున్నానన్నారు. అయితే టికెట్ విషయంలో చంద్రబాబు నాయుడు ఎలాంటి నిర్ణయం తీసుకున్నా దానికి కట్టుబడి కావలిలో టీడీపీ అభ్యర్థిని గెలిపించుకు తీరుతామన్నారు. పార్టీలోకి ఎవరు వచ్చినా పార్టీ బలోపేతం కోసం వారిని స్వాగతిస్తామన్నారు. అయితే కొత్త నాయకుల వలన పాత క్యాడర్ తమకు అన్యాయం జరుగుతోందేమోనని భయపడుతోందని, వారికి తాను భరోసాగా ఉంటానన్నారు. ఈ సమావేశంలో టీడీపీ పట్టణ ఇన్‌చార్జి అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్, నేతలు మన్నవ రవిచంద్ర, మొగిలి కల్లయ్య, జ్యోతి బాబూరావు, బొట్లగుంట శ్రీహరినాయుడు, దావులూరి దేవకుమార్, షేక్ మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి క్రీడల్లోనూ గుర్తింపు తేవాలి



విజేతలకు ట్రోఫీ అందిస్తున్న కావ్య కృష్ణారెడ్డి

**కావలిటౌన్, జనవరి 21:** జాతీయస్థాయి క్రీడల్లో కావలికి గుర్తింపు తేవాలని టీడీపీ నాయకుడు కావ్య కృష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ముసునూరులోని మైదానంలో ఇందిరానగర్ యూత్ ఆధ్వర్యంలో వారం రోజులుగా జరుగుతున్న డివిజన్ స్థాయి క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. అనంతరం జరిగిన బహుమతి ప్రదానం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణారెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులకు మంచి క్రీడా మైదానం ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. విన్నర్‌గా నిలిచిన కేసీపీడీ లెవెన్స్‌కు రూ.30,000, రన్నర్‌గా నిలిచిన లెవెన్ బుల్స్‌కు రూ.20,000, తృతీయ స్థానం సాధించిన కేకేఆర్ లెవెన్స్‌కు రూ.10,000, నాల్గవ స్థానంలో నిలిచిన లెవెన్ కింగ్స్‌కు రూ.5,000లతోపాటు ట్రోఫీలను అందజేశారు.

## నెల్లూరుకు తరలిన రజక యువకులు

**లింగసముద్రం, జనవరి 21 :** నెల్లూరులో ఆదివారం జరిగిన రజకుల చైతన్య సభకు లింగసముద్రం నుంచి పలువురు రజక యువకులు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో కామేపల్లి మధుసూదనరావు, కామేపల్లి మాలకొండయ్య, కామేపల్లి శ్రీనివాసులు, కొల్లపల్లి శ్రీనివాసులు, అరవింద్, సతీష్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్లకు ఆదర్శం డాక్టర్ రామ్



డాక్టర్ రామ్‌కు నివాళులర్పిస్తున్న బాధ్యులు

**కావలి, జనవరి 21:** వైద్య రంగంలో విశేష సేవలు అందించిన నెల్లూరు ప్రజావైద్యశాల వ్యవస్థాపకుడు పుచ్చలపల్లి రామచంద్రారెడ్డి(డాక్టర్ రామ్) డాక్టర్లకే ఆదర్శప్రాయుడిగా నిలిచారని రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ తాతిరెడ్డిలు తెలిపారు. డాక్టర్ రామ్ జయంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని ముసునూరు గిరిజన కాలనీలో వేడుకలు నిర్వహించారు. అనంతరం గిరిజనులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## లెనిన్‌కు ఘన నివాళులు



లెనిన్‌కు నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

**కందుకూరు, జనవరి 21:** సోషలిస్టు వ్యవస్థ రూపకర్త, కమ్యూనిస్టు సిద్ధాంతకర్త వీఐ లెనిన్ శత వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో బి.సురేష్‌బాబు అధ్యక్షతన లెనిన్ శతజయంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆపార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పోకూరి మాలకొండయ్య మాట్లాడుతూ మార్క్సిజాన్ని రష్యాకు అన్వయించి ప్రపంచంలో మొట్టమొదటి శ్రామికవర్గ రాజ్యాన్ని నెలకొల్పిన లెనిన్ ప్రపంచదేశాలన్నింటికీ ఆదర్శంగా నిలిశారన్నారు. ప్రజాసంఘాల నాయకుడు బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ లెనిన్ నాయకత్వంలో విజయవంతంగా నడిచిన అక్టోబరు విప్లవం, శ్రామికవర్గం రాజ్యం ఆవిర్భావం ద్వారా ప్రపంచంలో విప్లవోద్యమాలకు స్వాతంత్ర్యోద్యమాలకు స్ఫూర్తిని ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ముప్పవరపు కిషోర్, వై. ఆనంద్‌మోహన్, గాండ్ల హరిప్రసాదు, చనమాల కోటేశ్వరరావు, ఎస్కే హుస్సేన్, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలిగా ఉదయలక్ష్మి



**కావలిటౌన్, జనవరి 21:** బీజేపీ మహిళామోర్చా పట్టణ అధ్యక్షురాలిగా కామినేని ఉదయలక్ష్మి రెండవసారి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన సేవలను గుర్తించి పార్టీ రెండవ సారి అవకాశం కల్పించినందుకు సంతోషంగా ఉందని, అందుకు సహకరించిన మోర్చా జిల్లా అధ్యక్షురాలు కరణం సుభాషిణి, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్, రాష్ట్ర నాయకులు కందుకూరి సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు బ్రహ్మానందంకు కృతజ్ఞతలు తెలిపారు.

## కష్టపడితేనే విజయం సాధ్యం



రామయ్యను సత్కరిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

**కందుకూరు, జనవరి 21:** కష్టేఫలి అన్నట్లుగా విజయానికి మూలం శ్రమేనని విశ్రాంత లెఫ్టినెంట్ రమణయ్య పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో సీనియర్ ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు జూనియర్స్ ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనతికాలంలోనే ప్రకాశంలో ఎన్‌సీసీ ఎదుగుదలకు విద్యార్థుల క్రమశిక్షణే కారణమని ప్రశంసించారు. కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య మాట్లాడుతూ అకడమిక్స్, ఉద్యోగం, ఉపాధితో పాటు ఎన్‌సీసీ కూడా తమ కాలేజీలో అగ్రభాగాన ఉండేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా రామయ్యను ఎన్‌సీసీ క్యాడెట్లు, ఆఫీసర్లు సత్కరించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ నిర్వాహకుడు మీరావలి తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు మినరల్ వాటర్

**దగదర్తి(విడ్రగుంట), జనవరి 21:** దగదర్తి మండలం ఎలుపోడు పంచాయతీలో ఎంపీపీ తాళ్ళూరి వెంకట కృష్ణ ప్రసాద్ నాయుడు తల్లి సుజాతమ్మ జ్ఞాపకార్థం మినిరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. పేదప్రజలకు తాగునీరు అందించాలన్న లక్ష్యంతో నిర్మించిన ఈ ప్లాంటును



మినిరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న ఎంపీపీ

ఆయన కుమార్తెలు తాళ్ళూరి లక్ష్మీశివాణి, అస్మిత చేతుల మీదుగా ఆదివారం ప్రారంభించారు. స్వచ్ఛమైన తాగునీరు అందచేసినందుకు స్థానిక మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. తాళ్ళూరి రమణయ్య నాయుడు, సర్పంచు ఒట్టికాళ్ల రవి, మాజీ ఎంపీటీసీ ఇష్టంశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## యాదవులను దగా చేసిన జగన్‌కు బుద్ధి చెప్పాలి

**ఉలవపాడు, జనవరి 21 :** బీసీలలో బలమైన యాదవ సామాజిక వర్గాన్ని రాజకీయంగా వాడుకొని వదిలేసిన జగన్‌మోహన్ రెడ్డికి రాబోవు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీ యాదవ సామాజిక వర్గానికి చెందిన జంగా కృష్ణమూర్తి, కొలుసు పార్థసారథి, బుర్రా మధుసూదన్‌లను వాడుకొని దెబ్బకొట్టాడని తెలిపారు. రానున్న రోజుల్లో బీసీ ఆత్మగౌరవంతో రామచంద్ర యాదవ్ స్థాపించిన బీసీవై పార్టీ తరుపున పోటీ చేసి సత్తా చాటాలని, వైసీపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని పేర్కొన్నారు. బీసీలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఒక్క పైసా నిధులు కేటాయించకుండా మోసగించిన జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దించేవరకు బీసీలు కంకణం కట్టుకోవాలని పేర్కొన్నారు.

# కోదండరామాలయంలో ప్రత్యేక పూజలు



కందుకూరులో ప్రదర్శన నిర్వహిస్తున్న రామభక్తులు


**కందుకూరు, జనవరి 21:** అయోధ్యలో బాలరాముడు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం జరగనున్న సందర్భంగా పట్టణంలోని పామూరురోడ్డులో ఉన్న కోదండరామాలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులచే తయారు చేయించిన వెండి మకరతోరణాన్ని సీతాలక్ష్మణ హనుమత్ సమేత కోదండరామునికి అలంకరించి అభిషేకం, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహించగా మహిళలు అధికసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**నేడు స్వచ్ఛందంగా షాపుల మూసివేత**

అయోధ్యలో ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ప్రతి ఒక్కరూ ప్రత్యక్షంగా వీక్షించడం కోసం స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేయాలని కోరుతూ రామభక్తులు ఆదివారం సాయంత్రం కందుకూరు పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. పట్టణంలోని పెద్దబజారు నుంచి ప్రధాన వీధులలో ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా డాక్టరు తన్నీరు మల్లికార్జున తదితరులు మాట్లాడుతూ మధ్యాహ్నం వరకు ప్రతి ఒక్కరూ దుకాణాలు మూసివేసి ప్రాణప్రతిష్ఠ మహోత్సవాన్ని ప్రత్యక్షంగా వీక్షించాలని, దగ్గరలోని రామాలయానికి వెళ్లి శ్రీరాముని అనుగ్రహాన్ని పొందాలని విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని అంకమ్మ దేవాలయంలో ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేశామని అక్కడికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తామని, పెద్దబజారులోని కోదండరామాలయంలో పుష్పయాగం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా పట్టణంలోని జనార్ధనస్వామి ఆలయంలో ఆదివారం ఆలయశుద్ధి కార్యక్రమం నిర్వహించారు. ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో కోటిహనుమాన్ చాలీషా పారాయణయజ్ఞంలో భాగంగా ఏకాదశ హనుమాన్‌చాలీషా పారాయణం కార్యక్రమాలు నిర్వహించగా కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య, ధనలక్ష్మి దంపతులు, తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు: వెండి మకరతోరణం ధరించిన స్వామి



బిట్రగుంట : విద్యుత్ అలంకరణలో రామాలయం

**విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ప్రదర్శన**

**కావలిటౌన్ :** అయోధ్య రామాలయంలో సోమవారం బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠామహోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో పట్టణంలో ట్రంకురోడ్డులో ప్రదర్శన నిర్వహించారు. ఐదులాంతర్ల సెంటర్ వద్ద నుంచి ప్రారంభమైన ప్రదర్శనలో భక్తులు కషాయ జెండాలు చేతపట్టి జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేసుకుంటూ ముందుకు సాగారు. పుల్లారెడ్డి నగర్ వద్దనున్న సత్యనారాయణ స్వామి ఆలయం వరకు ప్రదర్శన నిర్వహించి అక్కడ వక్తలు ఉపన్యాసాలు ఇచ్చారు. ఉదయం బీజేపీ నేతలు పట్టణ పరిధిలోని పలు ఆలయాలు శుద్ధి చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నేతలు గునుపూడి సుబ్బరాయుడు, సురేంద్రరెడ్డి, వేదగిరి సూర్యనారాయణాచార్యులు, బీజేపీ నేతలు భరత్‌కుమార్, కందుకూరి సత్యనారాయణ, బ్రహ్మానందం, వీవీ రంగారెడ్డి, సీవీసీ సత్యం తదితరులు పాల్గొన్నారు.

**ఆలయం ముస్తాబు**

**బిట్రగుంట :** బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరులో వెలసి ఉన్న కోదండరామాలయంలో సీతారామలక్ష్మణాంజనేయ స్వాములకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుత్ దీపాలో ముస్తాబు చేశారు. ఆలయంలో రెండు రోజుల పాటు పూజాకార్యక్రమాలు ఉంటాయని అర్చకులు నరేష్ ఆచార్యులు తెలిపారు. కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలో శ్రీరామనామ సంకీర్తన, పూజలు జరిగాయి.

## కసుమూరులో భక్తుల రద్దీ

వెంకటాచలం, జనవరి 21 : మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కసుమూరు మస్తాన్ వలీ దర్గాలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలతోపాటు మన రాష్ట్ర నలమూల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మస్తాన్ స్వామిని దర్శించుకున్నారు. కొందరు భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించగా మరికొందరు అన్నదాన కార్యక్రమాలు చేపట్టి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా మస్తాన్ స్వామి దర్గాను పూలు, విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

## జనసేన క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న జనసేన నాయకులు

సైదాపురం, జనవరి 21: మండలంలోని దేవరవేమూరు, కట్టుబడిపల్లి గ్రామాల్లో వెంకటగిరి నియోజకవర్గ జనసేన సమన్వయకర్త గూడూరు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆదివారం జనంలోకి జనసేన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గడప గడపకు వెళ్ళి జనసేన పార్టీ సిద్ధాంతాలు, మ్యేనిఫెస్టో, బాబు షూరిటీ, భవిష్యత్ గ్యారంటీ కరపత్రాలు అందజేశారు. కట్టుబడి గ్రామంలో క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గుంజి పవన్, వేముల మధు తదితరులు పాల్గొన్నారు.

## దహన సంస్కారాల భవన నిర్మాణానికి శంకుస్థాపన

ఇందుకూరుపేట, జనవరి 21: మండలంలోని కొమరిక శ్మశాన వాటికలో వర్షాకాలం దహన సంస్కారాలు చేసేందుకు ఇబ్బందిగా ఉన్నందున కొమరిక వాసి, ఎన్ఆర్ఐ ఇందుపూరు పవన్‌కుమార్ రెడ్డి దాతృత్వంతో భవనం నిర్మించేందుకు ఆదివారం శంకుస్థాపన చేశారు. పలువురు గ్రామస్థులు దాతకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గూడూరు సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ చెన్నారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, వైసీపీ నేత శివకుమార్ రెడ్డి, పాల్గొన్నారు.






### కాకాణిని మళ్లీ గెలిపిస్తే
# సర్వేపల్లిని అమ్మేస్తాడు

- మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



టీడీపీలో చేరిన బీజేపీ, వైసీపీ నాయకులతో సోమిరెడ్డి

ముత్తుకూరు, జనవరి 21 : దోచుకోవడం తప్ప ప్రజల బాగోగులు పట్టించుకోని మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డిని మళ్లీ గెలిపిస్తే ఈసారి సర్వేపల్లి నియోజకవర్గాన్ని అమ్మేస్తాడని మాజీ మంత్రి, జాతీయ టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ముత్తుకూరు ప్రధాన కూడలిలో ఆదివారం నిర్వహించిన బహిరంగ సభలో బీజేపీ నాయకులు షేక్ అబ్దుల్ షఫీవుల్లా, వైసీపీ నాయకులు తిన్నెలపూడి సిద్ధు, వైసీపీ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు అలారి రమణమ్మ ఆధ్వర్యంలో 170 కుటుంబాలను టీడీపీలోకి సోమిరెడ్డి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ థర్మల్, పోర్టు భూముల పరిహారం పెంచడం దగ్గర నుంచి, సోమశిల నీటిని తెచ్చి పంటలు నష్టపోకుండా రైతులను కాపాడేందుకు పలు జీవోలు తెచ్చానన్నారు. మీ హయాంలో ప్రజలకు ఉపయోగపడే ఒక్క జీవో తెచ్చిన దాఖలాలు లేవన్నారు. ఈసారి వైసీపీ అధికారంలోకి వస్తే సీఎం జగన్ రాష్ట్రాన్ని అమ్మేస్తాడన్నారు. రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని నమ్మినవారు స్వచ్ఛందంగా టీడీపీలోకి వస్తున్నారన్నారు. జగన్ పేరు గుండెల మీద వేసుకున్న అభిమానులు, వాలంటీర్లు, వైసీపీ అరాచక పాలనతో విసిగి టీడీపీలో చేరుతున్నారన్నారు. అంతకు ముందు జెన్‌కో ప్రధాన రహదారి నుంచి ముత్తుకూరు వరకు టీడీపీ నాయకులు యువత ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రజల స్పందన చూసి, సోమిరెడ్డి వాహనం దిగివచ్చి ముత్తుకూరు వరకు బైక్ మీద ర్యాలీలో పాల్గొన్నారు. టీడీపీలో చేరిన షఫీవుల్లా ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సోమిరెడ్డిని గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు బొమ్మి సురేంద్ర, ముత్తుకూరు, టీపీ గూడూరు మండల టీడీపీ అధ్యక్షులు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, నాయకులు నీలం మల్లికార్జున్‌యాదవ్, ఈపూరు మునిరెడ్డి, ఏకొల్లు కోదండయ్య, కొత్తపల్లి రమేష్, శ్రీధర్‌రెడ్డి, శ్యామ్‌రెడ్డి, ఏడుకొండలు, శ్రీనివాసులు, శివకృష్ణ, మహేష్ పాల్గొన్నారు.

## శ్రీరామ భక్తుల భారీ ర్యాలీ

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 21: బుచ్చిరెడ్డిపాళెంలో ఆదివారం శ్రీరామ భక్తులు రేబాలకు చెందిన భువనేశ్వరం సిద్ధార్థ, పొన్నపోలు సుధీర్, జెట్టి సుకుమార్‌ల ఆధ్వర్యంలో పాదయాత్రతోపాటు కార్లు, బైక్‌లలో భారీ ర్యాలీ నిర్వహించారు. అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా బుచ్చి పెద్దూరులోని కోదండరామస్వామి ఆలయం నుంచి వేలాది మంది భక్తులు శ్రీరాముని జెండాలు చేతబట్టి చెన్నూరు రోడ్డు మీదుగా జై శ్రీరాం నినాదాలతో బస్టాండ్ సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి రేబాలలోని జాతీయ రహదారి పక్కన ఉన్న ఆంజనేయస్వామి విగ్రహం వరకు ప్రదర్శన చేపట్టారు. ఆంజనేయస్వామికి పూజలు నిర్వహించి తిరిగి బుచ్చి కోదండరామస్వామి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక పుష్పాలంకరణ, పూజలు నిర్వహించారు. సాయంత్రం అఖండదీపాలంకరణ, భజనలు నిర్వహించారు.

## కులగణన సర్వేకు సర్వర్ కష్టాలు

మనుబోలు, జనవరి 21: గ్రామాల్లో కులగణన సర్వేకు సర్వర్ కష్టాలు ఎదురవుతున్నాయి. ఒక్కో ఇంటివద్దనే అర్ధగంట పడుతోంది. గత మూడురోజులుగా గ్రామాల్లో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది కలిసి కులగణన సర్వే నిర్వహిస్తున్నారు. 29 నాటికి నూరు శాతం పూర్తిచేయాల్సి ఉంది. అయితే రోజుకు 30 కుటుంబాలు, అంతకంటె తక్కువ మాత్రమే చేయగలుగుతున్నారు. సర్వేను యాప్‌లో పొందుపరచడం, సెక్షన్-1లో కుటుంబ యజమాని, సెక్షన్-2లో ఇతర కుటుంబ సభ్యుల వివరాలు ఇలా విడివిడిగా చేయాల్సి రావడం, తరువాత వారిచేత వేలిముద్ర వేయించాల్సి ఉంది. దీంతో సర్వే కోసం వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఆదివారం కూడా అవస్థలు పడుతూ చేస్తున్నారు. కొన్ని సమయాల్లో సర్వర్ పనిచేయకపోవడంతో జనం విసుగు చెందుతున్నారు.

## బ్రాహ్మణ భవన్‌కు భూమిపూజ



ప్రత్యేక పూజలు చేస్తున్న బ్రాహ్మణులు

పొదలకూరు, జనవరి 21 : పొదలకూరు మేజర్ పంచాయతీ పరిధిలోని చిట్టేపల్లి తిప్ప వద్ద శ్రీ గాయత్రి ఉపాసక బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో రాపూరు, చేజర్ల, కలువాయి, పొదలకూరు మండలాలకు చెందిన 100 కుటుంబాల సమక్షంలో పట్టణ ప్రజల సహకారంతో బ్రాహ్మణ భవన్ నిర్మించనున్నారు. ఈ సందర్భంగా నాలుగు మండలాలకు చెందిన బ్రాహ్మణ కుటుంబాలతో స్థల ఆవరణలో ప్రత్యేక పూజలు, హోమాలు, పూర్ణాహుతిలను శాస్త్రోక్తంగా ఆదివారం చేపట్టారు. ఈ కార్యక్ర మంలో బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడు పణతుల శివకుమార్, గౌరవ అధ్యక్షుడు పీబీఎస్‌వీ ప్రసాద్‌రావు, అధ్యక్షుడు పీవీ శివకుమార్, ఉపాధ్యక్షుడు మాచవోలు రాజశేఖర్‌శర్మ, కార్యదర్శి ఎస్.మనోహర్, ట్రెజరర్ పీబీవీఎం కుమార్, సభ్యులు బి గోపాల కృష్ణమచార్యులు, బి కృష్ణమోహనచార్యులు, ఎస్ రమేష్, బ్రాహ్మణ కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంట్ విజేత కొమ్మలపూడి హెచ్‌సీసీ జట్టు



అతిథుల నుంచి కప్ అందుకుంటున్న కొమ్మలపూడి హెచ్‌సీసీ జట్టు

మనుబోలు, జనవరి 21: మండలం లోని కొమ్మలపూడి గ్రామంలో నిర్వహి స్తున్న మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్ విజేతగా కొమ్మలపూడి హెచ్‌సీసీ (హను మాన్ క్రికెట్ క్లబ్) జట్టు నిలిచింది. ఈనెల 7వ తేదీ నుంచి కొమ్మలపూడిలో సంక్రాంతి పండుగ సందర్భంగా మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను పెనమల్లి పెంచలరెడ్డి, కొండ్రెడ్డి ఉమామహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. మనుబోలు, వెంకటాచలం మండలాల నుంచి 24జట్లు ఈ టోర్నమెంట్ లో పాల్గొన్నాయి. ఆదివారం ఫైనల్ మ్యాచ్ లో కొమ్మలపూడి హెచ్‌సీసీ జట్టు, వెంకటాచలం మండలం వెంకటరెడ్డిపల్లికి చెందిన విఆర్‌పి జట్లు పోటీపడ్డా యి. నిర్ణీత పది ఓవర్లలో ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న హెచ్‌సీసీ జట్టు 81 పరుగులు చేయగా, విఆర్‌పీ జట్టు పది ఓవర్లు ముగిసే సరికి 70 పరుగులు మాత్రమే చేసి రన్నర్‌గా నిలిచింది. విజేత జట్టుకు ప్రథమ బహుమతిగా రూ. 20వేలు, రన్నర్ జట్టుకు రూ. 10వేలు నిర్వాహకులు అందజేశారు. ఉమ్మారెడ్డి విజయ్ కుమార్‌రెడ్డి, ఉమ్మడి హిమకర్, మహేష్, విజయ్ కుమార్‌లు బహుమతులకు దాతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్లుగా ప్రశాంత్, ప్రసాద్, శ్రీనువాసులు వ్యవహరించారు.

## మొగళ్లూరులో ఉచిత న్యూరాలజీ వైద్యశిబిరం

పొదలకూరు, జనవరి 21: మండలంలోని మొగళ్లూరు గ్రామంలో ఆదివారం ఉచిత న్యూరాలజీ వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఆకుల లక్ష్మి శిబిరాన్ని ప్రారంభించగా నెల్లూరుకి చెందిన డాక్టర్ బిందు మీనన్ రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.




# నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

## రూరల్ ఆర్యవైశ్య కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

- అధ్యక్షుడిగా అమర్తలూరి చెంచయ్య

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 21 : ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అనుబంధ సంస్థ నెల్లూరు రూరల్ ఆర్యవైశ్య కమిటీ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ ఎన్నికలు నగరంలోని జిల్లా రైస్ క్యాన్వాసింగ్ ఏజెంట్స్ కార్యాలయంలో జరిగాయి. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరువీధి ప్రకాష్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేగు షణ్ముఖరావు పర్యవేక్షణలో రూరల్ కమిటీ అధ్యక్షుడిగా అమర్తలూరి చెంచయ్య, ప్రధాన కార్యదర్శిగా చందా వెంకట స్వామి (ముత్తుకూరు), కోశాధికారిగా తెలనాకుల ఆదినారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చీఫ్ ఆర్గనైజర్ కోట గురుబ్రహ్మం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బ్రహ్మంగుప్తా, అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొండా ప్రవీణ్ శంకర్, కార్యవర్గ సభ్యులు భవనాపి సురేష్, దర్శి హరికృష్ణ, మండల ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.



నెల్లూరు రూరల్ ఆర్యవైశ్య కమిటీ ఎన్నిక

## నెల్లూరును అగ్రస్థానంలో నిలిపా..!

- మాజీ మంత్రి పొంగూరు నారాయణ



మహిళకు కరపత్రం అందిస్తున్న నారాయణ, కోటంరెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 21: తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధిలో రాష్ట్రంలోనే నెల్లూరును అగ్రస్థానంలో నిలిపానని మాజీ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నగరంలోని 9వ డివిజన్ కుసుమ హరిజనవాడలో ఆదివారం చేపట్టిన బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. టీడీపీ హయాంలో నగరంలో 90 శాతం అభివృద్ధి పనులు చేశామని వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మిగిలిన 10 శాతం పనులు కూడా పూర్తి చేయలేదని విమర్శించారు. రానున్న ఎన్నికలతో అధికారం చేపట్టిన వెంటనే మిగిలిన పనులన్నీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాళ్ళపాక అనురాధ, నారాయణ విద్యాసంస్థల జీఎం విజయభాష్కర్‌రెడ్డి, 9వ డివిజన్ ఇన్‌చార్జి కువ్వారపు బాలాజీ, అధ్యక్షుడు పాలూరు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ దినోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 21 : నగరంలోని అయ్యప్ప దేవస్థానంలో ఆదివారం అయ్యప్ప స్వామి వారి 38వ వార్షిక ప్రతిష్ఠాపన దినోత్సవం వైభవంగా జరిగింది. కేరళ సంప్రదాయ మకర మాస రోహిణి నక్షత్రం సందర్భంగా ఈ వేడుక నిర్వహించారు. మహాగణపతి హోమం, విశేష నవకలశ పూర్ణాభిషేకం, పుష్పాభిషేకం, అర్చన, మహా హారతి జరిపారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. ఆలయ అధ్యక్షుడు గూడల శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, పాలక మండలి సభ్యులు బొగ్గుల మురళీమోహన్‌రెడ్డి, నాగేశ్వరరావు, అక్కెం మల్లికార్జునరెడ్డి, చంద్రప్రభ తదితరులు పాల్గొన్నారు.

### అర్బన్ ఆర్యవైశ్య సంఘం
## అధ్యక్షుడిగా జ్యోతిప్రసాద్

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 21 : నెల్లూరు పట్టణ ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు పాండురంగ అన్నదాన సమాజంలో ఆదివారం జరిగాయి. ముక్కాల జ్యోతిప్రసాద్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ హాజరై నూతన కమిటీని అభినందించారు. సేవా కార్యక్ర మాలు విస్తృతంగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీర్ల సీతారామ్, శ్రీరామ్ సురేష్, గాదంశెట్టి గోపాల్, పీర్ల జనార్దన్‌రావు, పాదర్తి బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.




జ్యోతిప్రసాద్‌ను సత్కరిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

## కళాశాల అభివృద్ధికి సహకరిస్తా : మంత్రి కాకాణి

తోటపల్లిగూడూరు, జనవరి 21 : నాయుడు దశరథరామిరెడ్డి జూనియర్ కళాశాల అభివృద్ధికి తమ వంతు సహకరిస్తానని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని స్థానిక నాయుడు దశరథరామిరెడ్డి కళాశాలను ఆదివారం మంత్రి, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కలిసి ప్రారంభించారు. అనంతరం మంత్రి కాకాణి మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.2కోట్ల10లక్షలు ఇచ్చేందుకు తమవంతు కృషి చేస్తానని తెలిపారు. మాచర్లవారిపాలెంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి ప్రారంభించారు. ఎంపీపీ ఉప్పలత స్వర్ణలత, నాయకులు శంకరయ్యగౌడ్, మన్యం సుబ్రహ్మణ్యంగౌడ్, శేషమ్మ, కళాశాల ఉపాధ్యాయులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



కళాశాలను ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి, ఎంపీ వేమిరెడ్డి

### సామాజిక మాధ్యమాల ద్వారా
## అజెండాను ప్రజల్లోకి తీసుకెళ్లండి

- టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి




సోషల్ మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న గిరిధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, జనవరి 21 : రాబోవు సార్వత్రిక ఎన్నికలకు ప్రజలను చైతన్యపరిచే దిశగా టీడీపీ అజెండాను సోషల్ మీడియా వేదికగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి సంబంధించి సోషల్ మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. రానున్న మూడు నెలల కాలం సోషల్ మీడియా సభ్యులు చురుగ్గా పనిచేయాలని సూచించారు. పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు కష్టించి పని చేసిన ప్రతి ఒక్కరిని గుర్తించి తగు గౌరవం ఇస్తామన్నారు. కాగా, 17వ డివిజన్ వెలగచెట్టు సంఘానికి చెందిన వల్లం విజయ్ మిత్రబృందం రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరింది.

### రక్తదాతల మనసు గొప్పది

ఆపద సమయాల్లో రక్తాన్ని అందించి ఎందరివో ప్రాణాలను కాపాడుతున్న రక్తదాతల మనసు ఎంతో గొప్పదని గిరిధర్‌రెడ్డి కొనియాడారు. ధనలక్ష్మీపురంలోని హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రక్తదానంపై యువతలో మరింత చైతన్యం రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కుంచా విజయభాస్కర్, నోవా బ్లడ్ బ్యాంకు నిర్వాహకుడు నాగేశ్వరరావు, సొసైటీ సభ్యులు వినయ్, తబిత, రవి, పవన్‌రెడ్డి, మస్తానయ్య, తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, జనవరి 21 : మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. ముందుగా దువ్వూరు పాపిరెడ్డి, డైట్ కాలేజీ విద్యార్థి భూషణ్‌లు మహాత్మా గాంధీ, పొణక కనకమ్మ విగ్రహాలకు ఖాదీ వస్త్రాలు, నూలుమాలలు సమర్పించారు. అనంతరం కమిటీ సభ్యులు గంపల మంజుల, స్కూల్ విద్యార్థులకు గాంధీ ఆశయాల గురించి వివరించారు. అనంతరం పిల్లలకు ఫలహారం పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో డైట్ కాలేజీ విద్యార్థి మహేంద్ర, స్కూల్ విద్యార్థులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

## సర్వే రాళ్లపై జగన్ పేర్లతో రాజకీయాలు

- మాజీ మంత్రి సోమిరెడ్డి

తోటపల్లి గూడూరు, జనవరి 21 : వైసీపీ ప్రభుత్వం భూముల సర్వే రాళ్లపై జగన్ పేర్లు వేసి రాజకీయాలు చేస్తోందని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమో హన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మండలంలోని పేడూరు గ్రామంలో ఆదివారం టీడీపీ మండల అధ్యక్షుడు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి అధ్యక్షతన గౌడ కులస్థుల ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా సోమిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం బీసీ, ఎస్టీ, ఎస్సీలను చిన్నచూపు చూస్తోందన్నారు. పేదల భూములు కొల్లగొట్టేందుకు భూరక్ష చట్టాన్ని తెచ్చారని, వారి స్వలాభం కోసం ఈ చట్టాన్ని వాడుకుంటోందన్నారు. మంత్రి కాకాణి పుణ్యమా అంటూ కంటైనర్ పరిశ్రమ చెన్నైకి తరలిపోవడంతో పదివేల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. రెండు నెలలలో టీడీపీ జనసేన కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నామని, గౌడ కులస్థులకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సోమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, రేవంత్‌రెడ్డి, బీసీ నాయకులు మన్నెం జితేంద్ర గౌడ్, మన్నెం కిరణ్‌గౌడ్, నిమ్మల రమేష్‌గౌడ్, మధు గౌడ్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, వివిధ గ్రామాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు

## అరాచక పాలనకు చరమగీతం పాడాలి

- టీడీపీ కోవూరు నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి



ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, నాయకులు


కొడవలూరు, జనవరి 21 : రాష్ట్రంలో జరుగుతున్న అక్రమాలు, దౌర్జన్యాలు, కబ్జాలు ప్రశ్నించిన సామాన్య ప్రజలపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్న రాక్షస పాలనకు చరమగీతం పాడాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని నాయుడుపాలెం, బొడ్డువారిపాలెం, గువ్వగుంట గ్రామాల్లో ఆదివారం ఆయన ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన నాలుగేళ్ల వైసీపీ పాలనలో పెరిగిన నిత్యావసర ధరలు, కరెంటు చార్జీలతో ప్రజలు అల్లాడిపోతున్నారన్నారు. రాష్ట్రాభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. పరిశ్రమలు రాకపోగా ఉన్న పరిశ్రమలు పక్క రాష్ట్రాలకు తరలిపోతున్నాయన్నారు. యువత ఉద్యోగాలు లేక రోడ్డున పడుతున్నాయన్నారు. నియోజకవర్గంలో దోచుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజలు సంక్షేమం మరిచారన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో, నియోజకవర్గంలో టీడీపీ విజయం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, మాగుంట సతీష్‌రెడ్డి, నాపా వెంకటేశ్వర్లునాయుడు, పల్లంరెడ్డి సురేష్‌రెడ్డి, పల్లంరెడ్డి సుజిత్‌రెడ్డి, చెక్క మదన్, కేతూ వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### మినగల్లు ఇసుక రీచ్‌లో
## అక్రమ దందా..!?

- రోడ్డు నిర్మాణం పేరుతో
- రూ.500 - రూ.2వేలు డిమాండ్
- వ్యతిరేకించిన వాహన యాజమానులు

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 21 : మండలంలోని మినగల్లు ఇసుక రీచ్‌లో రోడ్డు నిర్మాణం పేరుతో వాహనదారుల నుంచి అక్రమ వసూళ్ల దందాకు రీచ్ నిర్వాహకులు తెరలేపారు. ఇసుక లోడుకోసం రీచ్‌కు వెళ్లే ప్రతి వాహనం వద్ద గ్రావెల్ రోడ్డు ఏర్పాటు పేరుతో 500 నుంచి 2 వేలు రూపాయల వరకు చెల్లించాలని డిమాండ్ చేశారు. 6టైర్ల టిప్పర్లకు రూ. 1000, 10టైర్ల లారీకి రూ.1500, 12టైర్ల లారీకి రూ. 2000 వంతున ట్రిప్పు ట్రిప్పుకు ఇస్తేనే ఇసుక లోడు అనే ఆంక్షలపై వాహనదారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం టన్నుకు రూ. 475 మించి పైసాకూడా అదనంగా ఇవ్వడం కుదరదని అడ్డం తిరిగారు. దీంతో రీచ్ నిర్వాహకులు, వాహనదారులకు మధ్య వాగ్వివాదం జరిగింది. ట్రాక్టర్లు, లారీల యజమానులు అడ్డం తిరగడంతో నిర్వాహకులు ఇసుక లోడింగ్‌ను నిలిపివేశారు. వాహనదారులు కూడా లారీలు, ట్రాక్టర్లను రీచ్‌లోనే పెట్టేసి వెళ్లిపోయారు. దీంతో ఆదివారం ఇసుక రవాణా ఆగిపోయింది. గత రెండు రోజులుగా రీచ్‌లో ఇదే పరిస్థితి నెలకొన్నట్లు తెలిసింది. ఇక్కడి రీచ్ నిర్వాహకుల ఆగడాలు రోజురోజుకు మితిమీరిపోతున్నాయంటూ స్థానిక ప్రజలు, వాహనదారులు ఆరోపించారు.

రీచ్‌లోనే నిలిపేసిన టిప్పర్లు, లారీలు





## చుక్కల్లో రామయ్య

అయోధ్యలో సోమవారం బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ప్రసిద్ధ చిత్రకారుడు గిన్నె సాగర్ సిరా చుక్కలతో రూపొందించిన శ్రీరాముడి చిత్రం ఇది. రోటరింగ్ పెన్‌తో లక్షలాది రంగు రంగుల సిరా చుక్కలు అద్దుతూ ఈ చిత్రాన్ని తీర్చిదిద్దారు. బిందు చిత్రకారుడిగా ప్రసిద్ధుడైన సాగర్.. తిరుపతిలోని టీటీడీ సంప్రదాయ శిల్ప కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు.

# పుంగనూరులో సీను మారిందా?

● భయపడటం నుంచి ఎదురొడ్డే స్థాయికి టీడీపీ శ్రేణులు

మంత్రి పెద్దిరెడ్డి ఇలాకాలో సీను మారిందా? భయపడటం నుంచి ఎదురొడ్డే స్థాయికి టీడీపీ శ్రేణులు వచ్చారా? మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం చౌడేపల్లెలో వాహనంలో వెళ్తుండగా.. రోడ్డు పక్కన టీడీపీ కార్యకర్తల చేతిలో రెపరెపలాడిన పసుపు జెండాలను చూస్తే.. ఈ ప్రశ్నలకు అవుననే సమాధానమే వస్తుంది.

పుంగనూరు నియోజకవర్గంలో పసుపు జెండాలు కనిపించరాదని సైకిల్ యాత్ర చేస్తున్న టీడీపీ కార్యకర్తల బట్టలు తీయించి కొన్ని నెలల కిందట వైసీపీ నేత దాష్టీకాన్ని ప్రదర్శించారు.

గతేడాది చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా పుంగనూరులో పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ జరిగిన గొడవ ఉద్రికత్తకు దారితీయడం, పోలీసు వాహనాల దహనం, రాళ్లు, కర్రలు, బాటిళ్లతో దాడులు.. లాఠీచార్జీ నేపథ్యంలో దాదాపు 500 మందిపై పోలీసులు కేసులు పెట్టారు.

.. ఇలా పుంగనూరులో విపక్షాలు ఏ కార్యక్రమం చేపట్టినా.. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వ్యతిరేకంగా కార్యక్రమాలు నిర్వహించినా పోలీసులు అడ్డుకోవడం అలవాటుగా మారింది. భారీగా కేసులు పెట్టి తీవ్ర ఇబ్బందులకూ గురిచేస్తున్నారు. ఈ క్రమంలో పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి కొంతకాలంగా 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమాన్ని చేపట్టారు. ఆదివారం చౌడేపల్లెలో చల్లాబాబు పర్యటన నేపథ్యంలో మండల పార్టీ అధ్యక్షుడు గువ్వల రమేశ్‌రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. చల్లా బాబు రొంపిచెర్ల నుంచి వస్తుండగా.. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరుకు వెళుతున్నారని, కొంతసేపు రోడ్డుపైకి రాకుండా చౌడేపల్లె బయటే ఉండి తర్వాత మీ కార్యక్రమం చేసుకోవాలని పోలీసులు సూచించారు. దీంతో ఆయన సంయమనం పాటించి గ్రామసమీపంలోనే ఉన్నారు. చల్లా బాబుకు స్వాగతం పలికేందుకు బళ్లారి డ్రమ్స్ వాయిస్తూ టీడీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పసుపు జెండాలతో చౌడేపల్లె బస్టాండుకు చేరుకున్నారు. వీరిని దూరంగా పోవాలని పోలీసులు చెప్పినా వినలేదు. తాము ఎందుకు పోవాలంటూ ఎదురుతిరిగారు. తాము తగ్గేదేలేదని, పుంగనూరులో టీడీపీ గెలుపు ఖాయమంటూ జేజేలు కొడుతూ భారీగా చేరుకున్నారు. మంత్రి వచ్చే సమయం దగ్గర పడటంతో పోలీసులు గొడవ చేయకుండా ఉండాలని కోరారు. చల్లా బాబు, మండలాధ్యక్షులు చిట్టి అన్న జిందాబాద్ అంటూ టీడీపీ శ్రేణులు నినాదాలు చేశారు. అదే సమయంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కాన్వాయ్ చౌడేపల్లె బస్టాండుకు చేరుకుంది. అయినా, టీడీపీ కార్యకర్తలు ఆగలేదు. పుంగనూరులో టీడీపీని గెలిపిస్తామని నినాదాలు చేస్తూ ఈలలు వేస్తూ, బళ్లారి డ్రమ్స్ వాయించారు. ఇలా కొన్నేళ్ల తర్వాత మొదటిసారి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వ్యతిరేకంగా, ఆయన వెళ్లే సమయంలో రోడ్డుపై టీడీపీ కార్యకర్తలు వచ్చారు. తిరుగుబాటు మొదలైందని ఎన్నికల ముందు కార్యకర్తలు సంకేతం ఇచ్చినట్లు అయింది. రోడ్డుపై ధైర్యంగా టీడీపీ శ్రేణులు నిలబడ్డారు.

- పుంగనూరు



మంత్రి పెద్దిరెడ్డి వాహనం వెళ్తుండగా.. పసుపు జెండాలను రెపరెపలాడిస్తున్న టీడీపీ శ్రేణులు



నటి శ్రీయ



తేజస్విని మనోజ్ఞ

## తిరుమల నాకు ఇష్టమైన ప్రదేశం

తిరుమల తనకు ఎంతో ఇష్టమైన ప్రదేశమని సినీ హీరోయిన్ శ్రీయ చెప్పారు. శ్రీవారిని ఆదివారం ఉదయం దర్శించుకున్న ఆమె ఆలయం బయట మీడియాతో మాట్లాడారు.అలాగే మిస్ ఎర్త్ ఇండియా-2019 తేజస్విని మనోజ్ఞ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు. - తిరుమల, ఆంధ్రజ్యోతి

## తిరుమలలో నేడు రామాయణ పారాయణం

తిరుమల, జనవరి21(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ధర్మగిరి వేదపాఠశాలలో సోమవారం సంపూర్ణ రామాయణ పారాయణం కార్యక్రమాన్ని టీటీడీ నిర్వహించనుంది. అయోధ్యలో సోమవారం రామాలయంలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు రామాయణ పారాయణం నిర్వహించనున్నారు.అయోధ్యలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగే ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఎస్వీబీసీ తమిళం, కన్నడ, హిందీ ఛానళ్లతో పాటు యూట్యూబ్ తెలుగు ఛానల్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. ఎస్వీబీసీ తెలుగు ఛానల్‌లో తిరుమలలోని కళ్యాణోత్సవం అనంతరం 12 గంటల నుంచి అయోధ్య కార్యక్రమాలు ప్రత్యక్షప్రసారం కానున్నాయి.

# రూ.3కోట్ల అనాధీనం భూమి స్వాహా!


● ఆన్‌లైన్లో గ్రామ కంఠంగా మార్చేసి ఆపై లేఅవుట్ వేసి విక్రయాలు
● దర్జాగా ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్లు
● ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు రంగం సిద్ధం

ప్లాట్లు వేసిన అనాధీనం భూమి



దక్షిణ కాశీగా పేరుబడ్డ శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం చివరకు భూదందాలకు మారుపేరుగా మారిపోయింది. ఖాళీ జాగా కనిపిస్తే చాలు అధికార పార్టీ నాయకులు చెరబట్టేస్తున్నారు.అవినీతి అధికారులు వీరికి కావాల్సినంత సహకారం అందిస్తున్నారు.తాజాగా తొట్టంబేడు మండలం రామచంద్రాపురంలో రూ.మూడు కోట్ల విలువైన అనాధీనం భూమిని ముక్కలు చేసి అమ్మేశారు. అధికారులు ఎంతకు తెగించారంటే...ఫేర్ అడంగల్‌లో అనాధీనంగా ఉన్న భూమిని ఆన్‌లైన్లో గ్రామకంఠంగా మార్చేశారు. అధికార పార్టీ ముఖ్య నేత బినామీ ఒకరు దర్జాగా లే అవుట్ వేసి విక్రయిస్తున్న ప్లాట్లకు బహిరంగంగా ఎంజాయ్ మెంటు సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. రేపో మాపో రిజిస్ట్రేషను చేసేందుకూ రంగం సిద్ధమవుతున్నట్లు సమాచారం.


తిరుపతి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన తొట్టంబేడు శ్రీకాళహస్తి పట్టణానికి ఆనుకుని ఉంది. తొట్టంబేడు రెవిన్యూ పరిధిలోని రామచంద్రా పురం,సాయినగర్, ఎల్‌ఐసీ కాలనీ, ఈదులగుంట ప్రాంతాలను శ్రీకాళహస్తి మున్సిపాలిటీలో విలీనం చేశారు. పట్టణం విస్తరిస్తుండడంతో ఈ ప్రాంతాల్లో శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి.ఇదే అదునుగా అక్రమార్కులు దోచేస్తున్నారు. రెండేళ్ల క్రితం తొట్టంబేడు తహసీల్దారు భూముల రికార్డులను తారుమారు చేసిన విషయంలో పట్టుబడి సస్పెండయ్యారు. ఆ తరువాత ఓ ఇంచార్జి అధికారిని ఇక్కడ నియమించుకున్నారు. అయితే ఇక్కడ పరిస్థితులు మారకపోగా మరింత దారుణంగా తయార య్యాయి.రాజీవ్‌నగర్, టిడ్కో గృహాలు,జగనన్న కాలనీ రామచంద్రాపురం పరిధిలోనే ఉండడంతో భూముల ధరలకు విపరీతమైన డిమాండ్ వచ్చింది. పలు ప్రైవేట్ లేఔట్లు కూడా రామచంద్రాపురంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. దీంతో ఈ గ్రామంపై అక్రమార్కులు కన్నేశారు. అధికారులు వారితో చేతులు కలిపి భారీ కుంభకోణానికి తెరతీశారు.ఇక్కడ భారీగా అనాధీన భూములున్నాయి. వాటిలో మొదట సర్వేనెంబర్ 90-1లోని 1.48ఎకరాల భూమిని కబళించేందుకు స్కెచ్ వేశారు. ముందుగానే ఫేర్ అడంగల్‌లో అనాధీనంగా ఉన్న భూమిని ఆన్‌లైన్లో గ్రామకంఠంగా మార్చేశారు.శ్రీకాళహస్తి నియోజక వర్గ అధికార పార్టీ ముఖ్య నేత బినామీ అయిన ద్విచక్ర వాహన షోరూం యజమాని రంగంలోకి దిగి ఆ భూమిలో 38 ప్లాట్లతో లేఔట్ వేశారు.అధికారుల అండతో ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్లు జారీ చేస్తూ రియల్ ఎస్టేట్ బ్రోకర్ల ద్వారా అమ్మేశారు.మార్కెటు ధర ప్రకారం రూ.15 లక్షల విలువ చేసే ప్లాటు సగం ధరకే లభించడం... పైగా రిజిస్ట్రేషన్ కూడా చేస్తుండడంతో జనాలు ఎగబడి కొన్నారు. ఈ కుంభకోణం వెలుగులోకి రాకముందే ఒకేసారి గుట్టుచప్పుడు కాకుండా రిజిస్ట్రేషన్లు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ముఖ్య నేత అండతో ఇందులో అన్నీ తానై వ్యవహరిస్తున్న అధికారి తీరు చర్చనీయాంశమవుతోంది.




ఫేర్ అడంగల్‌లో అనాధీనంగా ఉన్న రికార్డు




అధికారులు ఇచ్చిన ఎంజాయ్‌మెంట్ పత్రం




అక్రమ లేవుట్ మ్యాప్



ఆన్‌లైన్‌లో గ్రామకంఠంగా మార్పు చేసిన రికార్డు

## సూళ్లూరుపేట టిక్కెట్ సంజీవయ్యకే

### ఎంపీ విజయసాయిరెడ్డి ప్రకటన

### వైసీపీ యాత్రకు అసమ్మతి నాయకుల గైర్హాజరు

నాయుడుపేట, జనవరి 21 : సూళ్లూరుపేట అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ టికెట్ సిటింగ్ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు ఇవ్వాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయించిందని రీజనల్ కోఆర్డినేటర్, ఎంపీ విజయసాయిరెడ్డి ప్రకటించారు. నాయుడుపేటలో ఆదివారం నిర్వహించిన వైసీపీ సామాజిక సాధికార యాత్రలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పార్టీలో ఎవరైనా అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడాలని సూచించారు.ఈ విషయంలో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలుంటాయని హెచ్చరించారు.కాగా సామాజిక సాధికారిక యాత్రకు ఎమ్మెల్యే సంజీవయ్యను వ్యతిరేకిస్తున్న నాయకులెవరూ హాజరుకాలేదు.ఈ నేపథ్యంలో వారంతా ఎలాస్పందిస్తారో అన్న చర్చ జనంలో నడుస్తోంది.

# శ్రీకాళహస్తిలో టెన్షన్...టెన్షన్

### టీడీపీ ప్రచార రథాన్ని అడ్డుకున్న వైసీపీ నేతలు

### పోలీసులకు ఇరువర్గాల ఫిర్యాదులు...కేసుల నమోదు

శ్రీకాళహస్తి, జనవరి 21: టీడీపీ ప్రచార రథాన్ని వైసీపీ నేతలు అడ్డుకున్న ఘటన శ్రీకాళహస్తిలో శనివారం రాత్రి జరిగింది.శ్రీరామ్ నగర్ కాలనీలో టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితా రెడ్డి ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ ప్రచార రథం నుంచి సైకో పోవాలి సైకిల్ రావాలి అన్న పాటలు విన్పిస్తుండగా వైసీపీ ఏర్పేడు ఇంచార్జి కిషోర్ రెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ బోర్డు ప్రత్యేక ఆహ్వానితుడు మోహన్ రెడ్డి, అమ్మపాలేనికి చెందిన మురళి రెడ్డి మరికొందరితో కలిసి టీడీపీ రథాన్ని అడ్డుకున్నారు. సైకో పాటను నిలిపివేయాలనడంతో ఇరు పార్టీల నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సమీపంలోనే ఉన్న వైసీపీ కార్యాలయం నుంచి వారి ప్రచార రథాన్ని ఘటనా స్థలానికి చేర్చి టీడీపీ ప్రచార రథానికి ముందుగా సాగారు. మళ్లీ ఇరు వర్గాల మధ్య మాట మాటా పెరిగింది.టీడీపీ నాయకుడు కన్నలి ప్రతాప్ రెడ్డి సర్దిచెప్పారు.తర్వాత టీడీపీ ప్రచార రథాన్ని అడ్డుకున్న వారిలో ఒక్కరైన మురళి రెడ్డి ఊరందూరుకు చేరుకొని బొజ్జల సుధీర్ రెడ్డి కుటుంబ సభ్యులకు క్షమాపణ చెప్పినట్లు సమాచారం.కాగా ప్రచార రథాన్ని అడ్డుకున్న ఘటన ఆదివారం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దీంతో వైసీపీలో అంతర్మథనం జరిగినట్లు సమాచారం.ఆదివారం మధ్యాహ్నం మురళి రెడ్డి తమపై దాడి జరిగిందంటూ శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యారు. టీడీపీ నాయకులు తనను కిడ్నాప్ చేసి శనివారం అర్ధరాత్రి ఊరందూరుకు తీసుకువెళ్లి గన్ తలపై పెట్టి చంపేస్తామని బెదిరించినట్లు ఆరోపిస్తూ శ్రీకాళహస్తి 1వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.చివరకు టీడీపీ ప్రచార రథాన్ని అడ్డుకున్న ఘటనలో ఇరువర్గాల ఫిర్యాదులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. వైసీపీ నాయకుడు మురళి ఫిర్యాదు మేరకు కిడ్నాప్,దాడి కేసు నమోదు చేశారు. అలాగే టీడీపీ ప్రచార రథం డ్రైవర్ మోహన్ తనపై వైసీపీ నాయకులు కిషోర్ రెడ్డి, మోహన్ రెడ్డి, మురళి అడ్డుకొని దాడి చేయడంతో పాటు తనని కులం పేరుతో దూషించారని ఫిర్యాదు చేశారు. దీనిపై ఆ ముగ్గురి మీదా అట్రాసిటీ, దాడి కేసులు నమోదు చేశారు.

### మహిళల స్వేచ్ఛకు భరోసా ఏదీ: టీడీపీ

శ్రీకాళహస్తిలో మహిళల స్వేచ్ఛకు భరోసా లేదని సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ ప్రచార రథాన్ని అడ్డుకోవడంపై ఆమె తన ఆవేదనను వీడియోలో పొందుపరిచి సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారంలోకి తెచ్చారు.శ్రీరామ్ నగర్ కాలనీలో ప్రజాస్వామ్యబద్ధంగా ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేసుకుంటుంటే వైసీపీ కార్యాలయ సమీపంలో మద్యం సేవించిన ఆ పార్టీ నేతలు కిషోర్ రెడ్డి, మోహన్ రెడ్డి, మురళిరెడ్డి దుర్భాషలాడుతూ అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై బొజ్జల సుధీర్‌రెడ్డి ఏర్పేడు మండలం ఎండీపుత్తూరులో జరిగిన మీడియా సమావేశంలో స్పందించారు.తానెప్పుడూ ఎమ్మెల్యే కుటుంబ సభ్యుల జోలికి కానీ ఆయన సోదరుడు కిషోర్‌రెడ్డి జోలికి కానీ పోలేదన్నారు. అయితే వైసీపీ నేతలు తన కుటుంబంపై దాడి చేయడానికి ప్రయత్నం చేయడం బాధాకరమన్నారు. తన కుటుంబం జోలికి వస్తే తాట తీస్తానని హెచ్చరించారు.



వైసీపీ నేతలపై సీఐ అంజూయాదవ్‌కు టీడీపీ నాయకుల ఫిర్యాదు

## దొంగ ఓటర్ల నమోదు కుట్రపై చర్యలు తీసుకోండి

పోలీసులకు పులివర్తి నాని ఫిర్యాదు

పాకాల, జనవరి 21 : ఓటర్ల జాబితాలో బోగస్ ఓటర్లను చేర్పించిన కుట్రదారులపై చర్యలు తీసుకోవాలని చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పులివర్తి నాని పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఆదివారం పాకాల, చంద్రగిరి పోలీసులకు ఆయన ఫిర్యాదులందజేశారు. రాబోయే ఎన్నికల్లో గెలిచేందుకు వైసీపీ అభ్యర్థి, ఆయన అనుచరులు ఎన్నికల అధికారులతో కలిసి బోగస్ ఓటర్లను నమోదు చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎన్నికల అధికారుల లాగిన్ వినియోగించి కుట్రలకు పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఓటర్ల నమోదుకు ఫాం 6లో నమోదు చేసుకుంటే సంబంధిత బీఎల్వోలు క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులను చేర్పించాల్సి వుందన్నారు. అయితే చాలామంది బీఎల్వోలు వైసీపీ శ్రేణులతో కలిసి గుడ్డిగా నకిలీ ఓటర్లను నిజమైనవిగా ధ్రువీకరిస్తున్నారని ఆరోపించారు.30వేల నుంచి 40 వేల ఓట్లు ఇలా చేర్పించారని ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లినా విచారణ జరపలేదన్నారు. మూడేళ్ల క్రితం జరిగిన తిరుపతి లోకసభ ఉప ఎన్నికల సమయంలో చంద్రగిరి నియోజక వర్గ పరిధిలో వేలాది బోగస్ ఓటర్లను చేర్పించారన్నారు. ఇలాంటి అక్రమాలతోనే ఎంపీగా గురుమూర్తి విజయం సాధ్యమయిందన్నారు. మొబైల్ నెంబరుకు వన్‌టైమ్ పాస్‌వర్డ్ ఓటీపీలు లేకుండా నమోదు చేస్తున్నారంటే ఎన్నికల అధికారులు వీరికి సహకరిస్తున్నారని తెలుస్తోందన్నారు. ఎన్నికల అధికారులైన ఈఆర్వో, ఏఈఆర్వో, బీఎల్వోలు బాధ్యతారహితంగా అక్రమాలకు సహకరిస్తున్నారని అనుమానిస్తున్నామన్నారు. ఈసీ వెబ్‌సైట్‌ను దుర్వినియోగం చేయడంపై విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.



పాకాల పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న నాని

# గూడూరు
## సూళ్లూరుపేట/వెంకటగిరి

## దళితులపై దాడులను మరువలేం: పాశం


సమావేశంలో మాట్లాడుతున్న పాశం సునీల్‌కుమార్

గూడూరు, జనవరి 21: వైసీపీ ప్రభుత్వ పాలనలో దళితులపై జరిగిన దాడులను మరువలేమని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ విజయవాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి దళితులకు ఎంతో చేశామని కల్లబొల్లి మాటలు చెబుతున్నారని విమర్శించారు. వైసీపీ అధికారంలోకి రాగానే వైసీపీ పాలనలో దళితులపై హత్యలు, దాడులు పెరిగాయన్నారు. దళితులకు సంబంధించి 27 సంక్షేమ పథకాలను రద్దు చేశారని తెలిపారు. దళితుడైన కోడికత్తి శీను కేసు విచారణ జాప్యం చేయించడంతో పాటు అతడికి బెయిల్ రాకుండా ఇబ్బందులు పెట్టడం అన్యాయమన్నారు. దళితులకు అన్ని విధాల న్యాయం చేసిన ఏకైక పార్టీ టీడీపీయేనన్నారు. చంద్రబాబునాయుడు దళితుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు పరిచారన్నారు. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో దళితులను మరోసారి మోసం చేసేందుకే అంబేడ్కర్ స్మృతివనం ఏర్పాటు చేశారని దుయ్యబట్టారు. దళిత ద్రోహి అయిన సీఎం జగన్‌కు తగిన గుణపాఠం చెప్పి రానున్న ఎన్నికలలో టీడీపీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, పెంచలయ్య, ఇశ్రాయిల్‌కుమార్, రవీంద్రరెడ్డి, సురేంద్ర, శ్రీనివాసులు, కృష్ణయ్య, నాగేంద్ర, రవికుమార్, గురవయ్య, వెంకటయ్య, సురేష్, అల్లీహుస్సేన్, నాజరుద్దీన్, సునీల్, సందీప్, నాగార్జున, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామ భక్తబృందం శోభయాత్ర


శ్రీరాముని శోభయాత్ర నిర్వహిస్తున్న బీజేపీ నేతలు

నాయుడుపేట టౌన్, జనవరి 21: అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ సోమవారం జరగనున్న నేపథ్యంలో శ్రీరామ భక్తబృందం ఆధ్వర్యంలో శోభయాత్ర నిర్వహించారు. నాయుడుపేట పట్టణానికి చెందిన బీజేపీ సీనియర్ నేత సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం విజయగణపతి దేవస్థానం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు శోభయాత్ర నిర్వహించారు. శ్రీరాముని చిత్రపటాన్ని ఊరేగిస్తూ శ్రీరామ స్మరణతో ర్యాలీ సాగింది. శ్రీరామ భక్త బృందం, ఆర్యవైశ్యసంఘం, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తాం


గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న పెంచలయ్య

కోట, జనవరి 21: గిరిజనుల పట్ల ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నారని, ఇదే పరిస్థితి కొనసాగితే ఉద్యమాలకు ఊపిరిపోస్తామని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెంచలయ్య హెచ్చరించారు. మండల పరిధిలోని చెందోడు పంచాయతీలో గల ఎన్టీఆర్ కాలనీలోని గిరిజనుల కుటుంబాలతో ఆదివారం యానాది సంక్షేమ సంఘ నాయకులు ముఖాముఖి నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెంచలయ్యతో పాటు జిల్లా అధ్యక్షుడు మురళి, మహిళా అధ్యక్షురాలు చెంబేటి ఉషా, కలు బోతమ్మ, మస్తాన్, శ్రీకాంత్, సుధాకర్ ఇంటింటా తిరిగి గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యానాదుల సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. యానాదులకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చేపార్టీకి ఎన్నికల్లో మద్దతు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో యానాది సంక్షేమ సంఘ నాయకులు పాల్గొన్నారు.

## కోటమ్మకు విశేష పూజలు

కోట, జనవరి 21: గ్రామదేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారికి పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో ఉంచారు. కోట, వాకాడు, చిట్టమూరు, ఓజిలి, చిల్లకూరు మండలాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.



### ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, జనవరి 21: మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని అమ్మవారికి నైవేద్యం నివేదించి దర్శించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

### గంగమ్మకు..

చిల్లకూరు, జనవరి 21: స్థానిక పాలకేంద్రం సమీపంలోని గంగమ్మ ఆలయంలో గంగమ్మకు ఆదివారం విశేషపూజలు జరిపారు. ఉదయం మహిళలు సామూహికంగా సద్దితీసుకువచ్చి అమ్మవారికి నివేదించి భక్తులకు పంపిణీ చేశారు. సాయంత్రం పొంగళ్లు పెట్టి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

### అక్షింతల పంపిణీ

కోట, జనవరి 21: మండల పరిధిలోని వెంకన్నపాళెం, వీరారెడ్డిసత్రం గ్రామాల్లో ఆదివారం అయోధ్య రాముని అక్షింతలు పంపిణీ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పనబాక కోటేశ్వరరావు పాల్గొన్నారు.

### 24న జాబ్‌మేళా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి21: ఎస్వీయూలో ఈనెల 24న జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు ఎంప్లాయిమెంట్ ఆఫీసులో మేళా ప్రారంభం కానుంది. మొబైల్ మ్యానుఫ్యాక్చరింగ్, ల్యాబ్ అనలిస్ట్, మోటర్ ఫిట్టర్ వంటి ఈ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, డిగ్రీ చదువుకున్న వారు అర్హులు. సమగ్ర సమాచారం కోసం 7989810194లో సంప్రదించాలి.

## ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి

తడ, జనవరి 21: ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన తడ మండలంలోని చేనిగుంట వద్ద జరిగింది. నెల్లూరు జిల్లా కావలి మండలం, మద్దూరుపాడుకు చెందిన కాళహస్తి సాయివంశీకృష్ణ(27) సూళ్లూరుపేటలో నివాసం ఉంటూ తడలోని ఓ సంస్థలో పనిచేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం విధులకు హాజరయ్యేందుకు బైక్‌లో వెళ్తుండగా చేనిగుంట మలుపు వద్ద ఓ ట్రాక్టర్ రాంగ్‌రూట్‌లోకి వచ్చి ఢీకొంది. తీవ్ర గాయాలపాలైన సాయివంశీకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సాయికృష్ణ యాచేంద్రకు పరామర్శ

వెంకటగిరిటౌన్, జనవరి 21: ఇటీవల ప్రమాదంలో గాయపడిన ఎస్వీబీసీ ఛైర్మన్ సాయికృష్ణ యాచేంద్రను రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆదివారం పరామర్శించారు. త్వరగా కోలుకుని వచ్చే ఎన్నికల్లో వెంకటగిరిలో వైసీపీ విజయానికి కృషి చేయాలని కోరారు.

# వైసీపీ అరాచకాలతో పరిశ్రమలు పరార్

### తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి


సమావేశంలో మాట్లాడుతున్న రవి నాయుడు

డక్కిలి, జనవరి 21: జగన్ ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రానికి ఒక్క పరిశ్రమా రాకపోగా ఉన్నవి కూడా వైసీపీ నేతల అరాచకాలు చూసి తట్టుకోలేక ఇతర రాష్ట్రాలకు తరలి పోయాయని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయుడు ధ్వజమెత్తారు. ఆదివారం ఆయన డక్కిలిలో మీడియాతో మాట్లాడుతూ అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఐటీ మంత్రులు దావోస్ వెళ్లి పారిశ్రామిక వేత్తలతో మాట్లాడి పెట్టుబడులు తీసుకెళ్తుంటే మన పాలకులు తమ సీటు వుంటుందా.. ఊడుతుందా అని ఆలోచించే పనిలో వున్నారని ఎద్దేవా చేశారు. జగన్ ముఖ్యమంత్రి అవ్వడమే మన రాష్ట్రానికి పట్టిన ఖర్మ అని ఆవేదన వ్యక్తం చేశారు. పక్క రాష్ట్రానికి రూ.43 వేల కోట్లు పెట్టుబడులు వస్తుంటే మన ముఖ్యమంత్రి తనకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా వున్న 2.30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పిన జగన్ నాలుగున్నరేళ్లుగా ఆ ఊసేత్తడం లేదన్నారు. వెంకటగిరి వైసీపీ ఇన్‌చార్జి నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి ఏ మోహం పెట్టుకొని ఇంటింటికీ తిరుగుతున్నారో అర్థం కావడం లేదన్నారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయని, యువత గంజాయి మత్తులో పడి తమ జీవితాలను సర్వనాశనం చేసుకుటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజలు కళ్లు తెరిచి జగన్‌ను ఇంటికి సాగనంపకనపోతే రాష్ట్రం సర్వనాశనం అయిపోతుందని చెప్పారు. అంతకుముందు కుప్పాయపాళెం గ్రామంలో జరిగిన మండల స్థాయి వాలీబాల్ పోటీల ముగుంపు కార్యక్రమానికి రవి నాయుడు హాజరయ్యారు. విన్నర్‌గా నిలిచిన లింగసముద్రం జట్టుకు రూ.15వేలు, రన్నర్స్‌గా నిలిచిన కుప్పాయపాళెం జట్టుకు రూ.8 వేలు నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు తెలుగు యువత అధ్యక్షుడు కృష్ణా యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీకే ప్రసాద్ నాయుడు, మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, నాయకులు చెలికం భాస్కర్ నాయుడు, కిషోర్ నాయుడు, మూర్తి, హేమంత్ చౌదరి, సుకుమార్ వెంకటయ్య తదితరులు తదితరులు పాల్గొన్నారు.



మూతపడ్డ దుకాణాలు - నిర్మానుష్యంగా ఉన్న పాత శ్రీకాళహస్తి జీఎన్‌టీ రోడ్డు

# నాయుడుపేటలో సామాజిక సాధికార యాత్ర

### దుకాణాల మూత... దారి మళ్లింపుతో జనానికి ఇక్కట్లు


యాత్రలో విజయసాయిరెడ్డి, గురుమూర్తి, సంజీవయ్య తదితరులు

నాయుడుపేట, జనవరి 21: వైసీపీ చేపట్టిన సామాజిక సాధికార యాత్రను నాయుడుపేటలో ఆదివారం నిర్వహించారు. స్థానిక పిచ్చిరెడ్డి తోపులోని విజయగణపతి దేవస్థానం నుంచి పట్టణ పురవీధుల్లో వైసీపీ నాయకులు ర్యాలీగా అంబేడ్కర్ విగ్రహం వరకు నడిచారు.యాత్రను పురస్కరించుకుని పట్టణంలోని పలు దుకాణాలను మూసివేశారు. ప్రధాన దారుల్లో బారికేడ్లు పెట్టి రాకపోకలు మళ్లించడంతో ప్రజలు ఇక్కట్లు పడ్డారు. బందోబస్తుకు ఇతర ప్రాంతాల నుంచి పోలీసులు రావడంతో బారికేడ్ల సమీపంలోనే తమ నివాసాలు ఉన్నాయని ఆ దారిలో వెళ్లే జనం చెప్పినా వినకపోవడంతో వారు అసహనం వ్యక్తం చేశారు. మేనకూరు వెళ్లే రహదారిలో, పట్టణ ప్రధాన రహదారి అయిన పాత శ్రీకాళహస్తి రోడ్డులో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. బారికేడ్లు పెట్టేయడంతో అంతటి రద్దీ రహదారి నిర్మానుష్యంగా కన్పించింది. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో జరిగిన యాత్రలో వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్, ఎంపీ విజయసాయిరెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి, డీసీసీబీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ తంబిరెడ్డి జనార్దనరెడ్డి,కామిరెడ్డి రాజారెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కలికి మాధవరెడ్డి, పోట్లపూడి రాజేష్, చదలవాడ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే వ్యతిరేకవర్గం డుమ్మా

సామాజిక సాధికారిక యాత్రకు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య భారీగా జనసమీకరణ చేశారు. అయితే ఆయన్ను వ్యతిరేకిస్తున్న వైసీపీ నాయకులు కార్యక్రమంలో పాల్గొనలేదు. సూళ్లూరుపేట టికెట్ సంజీవయ్యకు ఇవ్వాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయించిందని విజయసాయిరెడ్డి ఈ సందర్భంగా ప్రకటించారు. పార్టీ నిర్ణయాలకు కట్టుబడి క్రమశిక్షణగా ఉండాలని అసమ్మతి నేతలు రామమోహన్‌రెడ్డి, జనార్దన రెడ్డి, రఫీ, శేఖర్‌రెడ్డిలకు సూచించారు.పార్టీ వ్యతిరేక కార్యకలాపాలపై కట్టా సుధాకర రెడ్డి, శ్రీమంత్‌రెడ్డి, రామమోహన్‌రెడ్డిలకు పార్టీ షోకాజ్ నోటీసులు ఇచ్చిందని వారి సమాధానం సంతృప్తికరంగా లేదన్నారు. పార్టీలో ఎంతటి వారైనా అధిష్ఠానం ఆదేశాలను శిరసావహించాల్సిందేనని లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.

# అంగన్వాడీల సమ్మెకు ముగింపు పలకాలి



గూడూరులో లెనిన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అంగన్వాడీలు - కోటలో ఒంటికాలిపై నిలబడి దండాలతో నిరసన

గూడూరు, జనవరి 21: రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని అంగన్వాడీల సమ్మెకు ముగింపు పలకాలని జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి హేమలత అన్నారు. ఆదివారం స్థానిక గ్రామసేవకుల భవనం వద్ద అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె 41వ రోజుకు చేరుకుంది. దీక్షా శిబిరంలో రష్యాలో తొలి కార్మిక వర్గ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన లెనిన్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సీఎం జగన్ అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం దుర్మార్గమైన చర్య అన్నారు. 41 రోజులుగా సమస్యల సాధన కోసం అంగన్‌వాడీలు ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. ఇప్పటికైనా వారి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శివకుమార్, బీవీ.రమణయ్య, సురేష్, ప్రసాద్, చంద్రయ్య, సుబ్బయ్య, ఇంద్రావతి, ప్రభావతి, పెంచలమ్మ, మునిలక్ష్మి, మంగమ్మ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

**కోట:** పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ఆదివారం కోట, వాకాడు, చిట్టమూరు మండలాల అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు వినూత్నరీతిలో నిరసన తెలిపారు. కొన్ని గంటలపాటు ఒంటికాలుపై నిలబడి దండాలు పెడుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఎం జగన్ డౌన్ డౌన్ అంటూ నినదించారు. చేశారు. న్యాయమైన తమ డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, ఇదే పరిస్థితి కొనసాగితే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పద్మలీల తదితరులు పాల్గొన్నారు.

# దొంగ ఓట్ల నమోదు వెనుక వైసీపీ ప్రజాప్రతినిధులు

### తెలుగు యువత, టీఎన్‌ఎస్‌ఎఫ్ నిరసన


గాంధీ విగ్రహం వద్ద తెలుగు యువత, టీఎన్‌ఎస్‌ఎఫ్ నేతల నిరసన

తిరుపతి, జనవరి21(ఆంధ్రజ్యోతి): జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రాన్ని దొంగ ఓట్లు రాజ్యంగా మార్చేశారని, తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాలు జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారాయని తెలుగు యువత, టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు విమర్శించారు. బోగస్ ఓట్ల కుంభకోణానికి నిరసనగా ఆదివారం గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయుడు మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎర్రచందనం స్మగ్లర్లు చేరి దొంగ ఓట్లకు అడ్డాగా మార్చేశారని మండిపడ్డారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, భూమన కరుణాకరరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, విజయానందరెడ్డి నేతృత్వంలో దొంగ ఓట్ల నమోదు జరిగిందని, అసలు సూత్రధారి జగన్ అని, తెర వెనుక సజ్జల రామకృష్ణారెడ్డి ఉన్నారని ఆరోపించారు. ఈ కుంభకోణం వెనుక ఉన్న అధికారులు ఇప్పటికే మూల్యం చెల్లించుకున్నారని, ఆ జాబితాలో మరికొంతమంది ఉన్నారని చెప్పారు. పోలీసు అధికారులపైనా చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని ఆయన డిమాండు చేశారు. టీఎన్‌ఎస్‌ఎఫ్ పార్లమెంటు అధ్యక్షుడు కొట్టే హేమంత్ రాయల్, తెలుగు యువత నాయకులు పెరుమాళ్ మధు, ఆర్సీ శ్రీనివాసులు మాట్లాడుతూ కార్పొరేషన్, టౌన్‌బ్యాంకు ఎన్నికల్లోనూ వైసీపీ దొంగ ఓట్ల జాతర అందరూ చూశారన్నారు. తిరుపతికి ప్రత్యేకాధికారిని నియమించాలని ఎన్నికల సంఘాన్ని కోరారు.

## వైసీపీ ప్రభుత్వం పోతేనే రాష్ట్రాభివృద్ధి: నరసింహయాదవ్

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 21: వైసీపీ ప్రభుత్వం పోతేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్ స్పష్టం చేశారు. దొంగ ఓట్లపై టీడీపీ, జనసేన పోరాటం ఆగదన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, తద్వారా ప్రతి పౌరుడూ ఇబ్బంది పడాల్సి వస్తోందని విమర్శించారు. ఆదాయం లేని రాష్ట్రంలో ఉన్న కంపెనీలను కాపాడుకోలేని పరిస్థితికి వైసీపీ దిగజారిపోయిందన్నారు. చెత్తపై పన్ను వేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ అని దుయ్యబట్టారు. ఇప్పటికే 9సార్లు కరెంటు ఛార్జీలు పెంచేశారన్నారు. మద్యపాన నిషేధం చేస్తామని చెప్పి సొంత మనుషులకు కాంట్రాక్టులు ఇచ్చి వేల కోట్లు సంపాదించుకున్నారన్నారు. నాసిరకం మద్యం తాగి ఎంతోమంది అనారోగ్యానికి గురయ్యారని తెలిపారు. బడుగు బలహీన వర్గాలు తీవ్రంగా నష్టపోయాయని పేర్కొన్నారు. జగనన్న కాలనీల పేరుతో ముందుగా వైసీపీ నాయకులు అగ్రిమెంట్లు చేసుకుని భూమి విలువకన్నా పదిరెట్లు అధికంగా ప్రభుత్వం నుంచి కాజేశారని ఆరోపించారు. టీడీపీ విడుదల చేసిన భవిష్యత్తు గ్యారెంటీ పథకాలను వివరించారు. ఉపాధి, ఉద్యోగాలు, యువకులు, నిరుద్యోగులు, పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే టీడీపీ, జనసేన ప్రభుత్వంతోనే సాధ్యమని గుర్తు చేశారు. తిరుపతిలో రోడ్లు వేసి అభివృద్ధి అంటే ప్రజలు నవ్వుకుంటున్నారని, వీటి వెనుక భాగోతం ప్రజలకు తెలుసునని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, నాయకులు విజయకుమార్, రమణ, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

### శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.06 కోట్లు

తిరుమల, జనవరి21(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.06 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది.

## పేదల అభ్యున్నతే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న నరేంద్రరెడ్డి

పెళ్లకూరు, జనవరి 21: పేదల అభ్యున్నతే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 171 సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకుని ప్రజలు ఆర్థికాభివృద్ధి సాధించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని తాళ్వాయిపాడు, పెన్నేపల్లి గ్రామాల్లో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్ని మాట్లాడారు. అర్హులైన లబ్ధిదారులకు అందుతున్న పథకాల ప్రయోజనాలను వివరిసూ.. అర్హత ఉండి పథకాలు అందని వారిని గుర్తించి ప్రయోజనం చేకూర్చడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులతో పాటు ఉజ్వల గ్యాస్ కనెక్షన్‌లను మహిళలకు అందజేశారు. డ్రోన్ ద్వారా పురుగు మందుల పిచికారి విధానాన్ని అధికారులు ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్‌బాబు, చెంబేడు పీహెచ్‌సీ వైద్యాధికారి చంద్రమోహన్‌రెడ్డి, ఏవో గొడవర్తి ప్రవీణ, ఈవోపీఆర్డీ విజయమ్మ, సర్పంచు కుదిరి లక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సాయిలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సమ్మన శ్రీహరి, బీజేపీ అధ్యక్షుడు గోగుతోటి మురళి, మండల ప్రధాన కార్యదర్శి నరసింహ రవి, జనార్దన్ పాల్గొన్నారు.

## దివ్యాంగులకు కూరగాయల అందజేత


దివ్యాంగులకు కోడిగుడ్లు, కూరగాయలు అందజేస్తున్న జేవీవీ సభ్యులు

గూడూరు, జనవరి 21: స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో చెంచునారాయణ దాతృత్వంతో దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేవీవీ పట్టణాధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, చెంచునారాయణ, విజయబాబు, పురుషోత్తమరావు, సుబ్రహ్మణ్యం, మురళీసింగ్, మధు, సుబ్బారావు, రాజేష్, సుధీర్, రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## నిత్యవసరాల పంపిణీ



గూడూరు, జనవరి 21: స్థానిక డీఎన్‌ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం సింహపురిరెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్లు జనార్దన్‌రెడ్డి, రోహిణి దాతృత్వంతో పేదలకు నిత్యవసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రజేంద్రరెడ్డి, ధనుంజయరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, రాఘవరెడ్డి, రవీంద్రరెడ్డి, గోపినాధ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం


రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

సూళ్లూరుపేట, జనవరి 21: సూళ్లూరుపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అలవలవారి కంటి వైద్యశాలలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు కాపిరెడ్డి రాజారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు అనిల్ రెడ్డి సహకారంతో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ సాయిరాం వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. 110 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 25 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వారికి తిరుపతిలోని అరవింద వైద్యశాలలో ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు అట్రంబాకం దశరధ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు ఆరణి విజయ భాస్కర్ రెడ్డి, అలవల సుధాకర్ రావు, వేనాటి ధనుంజయ రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, నాదెండ్ల శాంతకుమారి, సుంకర ప్రతిమ, వేనాటి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి విశాఖకు ఇంద్ర ఏసీ సర్వీసు

తిరుపతి(కొర్లగుంట), జనవరి 21: తిరుపతి, విశాఖపట్నం మధ్య ఇంద్ర ఏసీ సర్వీసును సోమవారం నుంచి ప్రారంభించనున్నారు. తిరుపతి సెంట్రల్ బస్టేషన్ నుంచి రోజూ సాయంత్రం 4 గంటలకు 11వ నంబరు ప్లాట్‌ఫాం నుంచి బయల్దేరుతుంది. మరుసటి రోజు ఉదయం 7.45 గంటలకు విశాఖపట్నానికి చేరుకుంటుంది. అక్కడి నుంచి సాయంత్రం 5గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 8.30గంటలకు తిరుపతికి చేరుకుంటుంది. సీటింగ్ సామర్థ్యం 40, టిక్కెట్ ధర పెద్దలకు రూ.1,760, పిల్లలకు రూ.1,400గా నిర్ణయించారు. రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని మంగళం డిపో మేనేజర్ భాస్కర్ తెలిపారు.

## భక్తిసాగరంలో ముంచెత్తిన అఖండ పారాయణం

తిరుమల, జనవరి21(ఆంధ్రజ్యోతి): లోకకల్యాణం కోసం శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమలలోని నాదనీరాజనం వేదికపై ఆదివారం ఉదయం జరిగిన 6వ విడత అయోధ్యకాండ అఖండ పారాయణం భక్తులను భక్తిసాగరంలో ముంచెత్తింది. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో అయోధ్యకాండలోని 18 నుంచి 21 సర్గల్లో ఉన్న 199 శ్లోకాలు, యోగవాశిష్టం, ధన్వంతరి మహామంత్రంలోని 25 శ్లోకాలు కలిపి మొత్తం 224 శ్లోకాలను పారాణయం చేశారు. ధర్మగిరి వేదపాఠశాల పండితులు రామానుజాచార్యులు, అనంత గోపాలకృష్ణ, మారుతి శ్లోక పారాయణం చేశారు. అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు శ్రీనివాస్ బృందం రామా సీతారామ కీర్తనను ప్రారంభంలో, రాముని భజన సేయవే మనసా అనే కీర్తనను చివరలో రసరమ్యంగా ఆలపించారు.